బాల వసంతం



కళకళలాడుతున్న చీనీతోట

బడిలో పుస్తకాలు.. ఇంట్లో టీవీ, స్మార్ట్ ఫోన్‌లు.. ఇవి తప్ప వేరే ప్రపంచం లేదన్నట్లు గడుపుతున్న చిన్నారులను మరో ప్రపంచంలో విహరింపజేసే బాలోత్సవం అనంతలో ఆహ్లాదకర వాతావరణంలో మొదలైంది. బాలల ప్రతిభ, సృజనను ప్రదర్శించే వేదికకు ఎప్పటిలాగే భారీ స్పందన లభించింది. తొలిరోజే ఏకంగా 15 వందల మంది చిన్నారులు వేడుకలలో భాగమయ్యారు. సందర్శకులను అబ్బురపరిచే ప్రదర్శనలు ఇచ్చారు. ఇంకో రెండు రోజులు ఈ వేడుకలు కొనసాగుతాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం కల్చరల్





రైతుల ఆశలకు జీవం

నిండుకుండలా ముకుందాపురం చెరువు

- పెరిగిన భూగర్భ జలాలు
- చీనీ రైతుల్లో వెల్లివిరిసిన ఆనందం
- వైసీపీ పాలనలో నీరు లేక ఎండిన చీనీ తోటలు

గార్లదిన్నె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఏడాది క్రితం ఆ గ్రామంలో నీరు లేక వేలాది చీనీచెట్లు ఎండుముఖం పట్టాయి. చీనీతోటలను కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి రైతులు ఆర్థికంగా చితికిపోయారు. వందల అడుగుల లోతు బోర్లు వేసినా చుక్క నీరు రాక ట్యాంకర్ల ద్వారా తోలుకుని అప్పుల పాలయ్యారు. నేడు చెరువుకు నీరు రావడంతో ఆ గ్రామ రైతుల ఆశలు చిగురించాయి. గార్లదిన్నె మండల కేంద్రానికి 13 కిలో మీటర్ల దూరంలో ముకుందాపురం గ్రామం ఉంది. గ్రామంలో సుమారు 600 కుటుంబాలు ఉన్నాయి. అందులో 90 శాతం మంది రైతులే ఉన్నారు. గ్రామం మొత్తం చీనీ సాగుచేసుకునేవారు. 2019, 2023 సంవత్సరాల్లో చెరువుకు నీరు రాకపోవడంతో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటిపోయాయి. దీంతో బోరుబావుల్లో చుక్క నీరు రాక రైతులు సాగుచేసిన చీనీ తోటలు ఎండుముఖం పట్టాయి. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి సాగుచేసిన చీనీ ఎండిపోతుంటే కాపాడుకునేందుకు సుమారు 900 అడుగులకు పైగా బోర్లు వేసినా ఫలితం లేకపోయింది. కళ్లముందు ఎండిపోతున్న చీనీ తోటలను కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి యర్రగుంట్ల, సంజీవపురం, కొట్టాలపల్లి తదితర గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకున్నారు. ప్రస్తుతం నీరు విడుదల కావడంతో ముకుందాపురం చెరువు నిండుకుండను తలపిస్తోంది. దీంతో భూగర్భ జలాలు పెరిగి బోరుబావుల్లో నీరు పుష్కలంగా ఉండడంతో రైతన్నలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమ పంటలకు మళ్లీ జీవం వచ్చిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

20 బోర్లు వేసినా నీరు పడలేదు



గత ఏడాది గ్రామంలో నీటి సమస్య తలెత్తడంతో చీనీ చెట్లను కాపాడుకునేందుకు సుమారు రూ.15 లక్షలు ఖర్చు చేసి 20 బోర్లు వేసినా చుక్క నీరు పడలేదు. రైతులందరు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఏడాది గ్రామంలో చెరువు నిండింది. భూగర్భ జలాలు సమృద్ధిగా ఉన్నాయి. 12 ఎకరాల పొలంలో 9 ఎకరాలు చీనీ, 3 ఎకరాలు టమోటా సాగుచేశా. ప్రస్తుతానికి గ్రామంలో నీటి సమస్య తగ్గింది.

- కోదండరాముడు, రైతు, ముకుందాపురం



నిండుకుండను తలపిస్తున్న ముకుందాపురం చెరువు



గత ఏడాది ఫిబ్రవరిలో ముకుందాపురం చీనీ తోటల పరిస్థితిపై ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనం



ముకుందాపురంలో టమోటా పంట

ట్యాంకర్లతో తోలి కాపాడుకున్నాం



పీఏబీఆర్ కుడికాలువ ద్వారా చెరువుకు నీరు విడుదల చేశారు. చెరువు నిండడంతో మా గ్రామంతో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో కూడా భూగర్భ జలాలు సమృద్ధి చెందుతున్నాయి. గత ప్రభుత్వ పాలకుల నిర్లక్ష్యంతో 2019, 23లో గ్రామంలో నీటి కొరత ఏర్పడింది. సంజీవపురం, యర్రగుంట్ల, కొట్టాలపల్లి గ్రామాల నుంచి లక్షలు ఖర్చు చేసి ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకుని చీనిచెట్లను కాపాడుకుంటు వచ్చాం. ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకున్న రైతులకు ఉద్యానవన శాఖ ద్వారా బిల్లులు మంజూరు చేస్తామని సంబంధిత అధికారులు చెప్పి ఫోటోలు తీసుకున్నారే తప్ప ఒక్క రూపాయి పడలేదు.

- నరసింహారెడ్డి, రైతు, ముకుందాపురం

సమృద్ధిగా భూగర్భజలాలు



చెరువు నిండి మరువ పారుతోంది. గ్రామంలో భూగర్భ జలాలు సమృద్ధిగా ఉండడంతో ఆనందంగా ఉన్నాం. 2019, 2023లో భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో నీటి సమస్య తీవ్రంగా ఏర్పడింది. చీనీ చెట్లను కాపాడుకునేందుకు లక్షలాది రూపాయలు ఖర్చు చేసి బోర్లు వేసినా ఫలితం లేకుండా పోయింది. చెట్లను కాపాడుకునేందుకు ట్యాంకర్ల ద్వారా నీరు తోలుకున్నాం. ఈ ఏడాది చెరువు నిండడంతో నీటి సమస్య లేదు.

- గంగాధర్, రైతు, ముకుందాపురం

చీనీ సాగు.. మా ప్రత్యేకత



ముకుందాపురం గ్రామంలో రైతులందరు చీనీసాగు చేస్తున్నారు. చీనీసాగులో ముకుందాపురానికి రాష్ట్రంలోనే ప్రత్యేకత ఉంది. అధికారులు, పాలకుల నిర్లక్ష్యంతో 2019, 2023లో చెరువుకు నీరు రాలేదు. దీంతో భూగర్భ జలాలు అడుగంటిపోయాయి. వివిధ గ్రామాల నుంచి ట్యాంకర్ల ద్వారా నీళ్లు తోలుకుని చీనీతోటలను కాపాడుకున్నాం. ప్రస్తుతానికి చెరువుకు నీరు రావడంతో గ్రామంలో రైతులందరికి ఊరట కలిగింది.

- వెంకట్రామిరెడ్డి, రైతు, ముకుందాపురం

మూన్నాళ్ల ముచ్చటేనా..?

- కొనసాగుతున్న ఇసుక అక్రమ రవాణా
- నామమాత్రపు దాడులతో సరిపెట్టిన అధికారులు



చుక్కలూరు వద్ద డంప్ చేసిన ఇసుకను లోడ్ చేస్తున్న దృశ్యం

తాడిపత్రి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమ రవాణాపై పోలీసుల దాడులు మూన్నాళ్ల ముచ్చటేనా అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఇసుకాసురులకు అధికారుల అండ ఉండడంతో పేట్రేగిపోయి తోడేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెన్నానది ప్రాంతంలో ట్రాక్టర్లు, టిప్పర్లలో తరలిస్తున్నారు. నియోజకవర్గంలోని తాడిపత్రి, పెద్దపప్పూరు, పెద్దవడుగూరు ప్రాంతాల్లో పెన్నానది, శింగనమల నియోజకవర్గంలోని యల్లనూరులో చిత్రావతి నది విస్తరించి ఉంది. ఈ నదుల నుంచి ఇసుక నాణ్యతగా ఉండడంతో కర్నూలు, నంద్యాల జిల్లాలకు ఎక్కువగా తరలిస్తున్నారు. రాత్రిపగలు తేడా లేకుండా యథేచ్ఛగా రవాణా చేస్తున్నారు.



చుక్కలూరు వద్ద పెన్నానదిలో ఇసుకను తవ్వేసిన దృశ్యం

దీంతో నదులు కళావిహీనంగా తయారుకావడంతోపాటు భూగర్భజలాలు అడుగంటిపోతున్నాయి.

యథేచ్ఛగా అక్రమ రవాణా

అధికారులు పట్టించుకోకపోవడంతో తాడిపత్రి మండలంలోని గంగాదేవిపల్లి, చుక్కలూరు, పులిప్రొద్దుటూరు, చిన్నపొలమడ, వీరాపురం, సజ్జలదిన్నె, అక్కన్నపల్లి, ఆలూరు గ్రామాల వద్ద ట్రాక్టర్లతో మూతబడ్డ పరిశ్రమల వద్ద డంపింగ్ చేసి రాత్రి వేళల్లో టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారు. అటువైపు ఏ అధికారి కన్నెత్తి చూడడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. పెద్దపప్పూరు మండలం నరసాపురం, గార్లదిన్నె, కుమ్మెత, పసలూరు గ్రామాల శివార్ల నుంచి ఇసుక అక్రమ రవాణా కొనసాగుతోంది. పెద్దవడుగూరు మండలం చిట్టూరు, చిత్రచేడు, కొండూరు, నాగలాపురం నది పరివాహక ప్రాంతాల నుంచి ఇసుక తరలుతున్నా కట్టడిచేయడంలో అధికారులు విఫలమయ్యారు. పెద్దవడుగూరు నుంచి నంద్యాల జిల్లాకు ఇసుకను తరలించాలంటే యాడికి మండలంలోని రాయలచెరువు మీదుగా వెళ్లాల్సి ఉంటుంది. యాడికి పోలీసులు దాడులు నిర్వహించి టిప్పర్లు, ట్రాక్టర్లను సీజ్‌చేసిన సంఘటనలు చాలా తక్కువగా ఉన్నాయి. యల్లనూరు మండలంలోని శింగవరం, లక్షుంపల్లి, మేడికుర్తి, తిరుమలాపురం చిత్రావతి నది నుంచి పెద్దఎత్తున ఇసుక దోపిడీ జరుగుతోంది.

పట్టించుకోని అధికారులు

నియోజకవర్గవ్యాప్తంగా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నా మైనింగ్ అధికారులతోపాటు ఆ మండల రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టించుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. నిత్యం పదుల సంఖ్యలో వాహనాలు వెళుతుంటే చూసిచూడనట్లు వ్యవహరిస్తున్నారా..? లేక వీరికి మామూళ్లు అందుతున్నాయా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అక్కడక్కడ ఒకట్రెండు పట్టుకొని సీజ్‌చేసి మమ అనిపిస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి.

ఇసుక రవాణాను అడ్డుకుంటాం



తాడిపత్రి నియోజకవర్గంలో ఎక్కడ అక్రమ ఇసుక రవాణా జరిగినా కచ్చితంగా అడ్డుకుంటాం. ఎప్పటికప్పుడు దాడులు నిర్వహిస్తూనే ఉన్నాం. అక్రమ రవాణాకు చెక్‌పెట్టేందుకు రెవెన్యూ సిబ్బందితో కమిటీలు కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడైనా అక్రమంగా ఇసుక రవాణా జరుగుతుంటే మా దృష్టికి తీసుకురావాలి. తప్పకుండా చర్యలు తీసుకుంటాం.

- ఓబులరెడ్డి, ఏడీ, భూగర్భ గనుల శాఖ

ఆదర్శప్రాయుడు.. దామోదరం సంజీవయ్య

జేసీ శివనారాయణ శర్మ



సంజీవయ్య చిత్రపటం వద్ద జ్యోతి వెలిగిస్తున్న జేసీ

అనంతపురంటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): అత్యున్నత వ్యక్తిత్వం, ఉన్నత విలువలు కలిగిన ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆదర్శప్రాయుడని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ కొనియాడారు. స్థానిక కలెక్టరేట్‌లో శుక్రవారం ఎస్సీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. అనంతరం జేసీ మాట్లాడుతూ.. దళిత కుటుంబంలో పుట్టిన సంజీవయ్య అసమాన ప్రతిభతో సీఎం స్థాయికి ఎదిగారన్నారు. నిజాయతీ, నిరాడంబర జీవితానికి మారుపేరుగా నిలిచారన్నారు. ఆయన అడుగు జాడల్లో ప్రతిఒక్కరూ నడవాలని జేసీ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, డీఆర్వో మలోల, ఎస్సీ సంక్షేమ శాఖ ఇన్‌చార్జి డీడీ రాధిక, డిప్యూటీ కలెక్టర్ తిప్పేనాయక్, దళిత సంఘాలు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

గేమ్ చేంజర్..!

వాట్సాప్‌లో ఒక్క మెసేజ్‌తో 161 సేవలు

(వివరాలు 7వ పేజీలో...)

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు 6

రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మందికి కంటి పరీక్షలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు 7

స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు

హాజరైన మహారాష్ట్ర మంత్రి సంజయ్‌భావ్ రాథోడ్



ప్రజలు కోరినట్లు బ్రిడ్జి నిర్మించండి

ఎన్‌హెచ్‌ఏఐ ఆర్వోకు ఎంపీ, ఎమ్మెల్యే వినతి



వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే, ఎంపీ

రాయదుర్గం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): డి.హీరేహాళ్ పరిధిలోని ఎన్‌హెచ్ 150-ఎపై ప్రజాభీష్టానికి అనుగుణంగా బ్రిడ్జి నిర్మించాలని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ అధికారి బ్రహ్మోకర్‌కు ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు విజ్ఞప్తి చేశారు. బెంగుళూరులోని ఎన్‌హెచ్ఏఐ ప్రాంతీయ కార్యాలయంలో శుక్రవారం ఆయనను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇదే అంశంపై నాలుగురోజుల క్రితం ఢిల్లీలో కేంద్ర రవాణా మంత్రిత్వశాఖ కార్యదర్శిని, ఆ సంస్థ చైర్మన్‌ను విడివిడిగా కలిసి వినతిపత్రాలు సమర్పించారు. పెరిగిన వాహనాల రద్దీ, స్థానికులు, విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందిగా ఉందని ఆయనకు వివరించారు. గ్రామం మధ్యలో జాతీయ రహదారిని దాటడానికి సమస్యగా ఉందని తెలిపారు. బాక్స్ మోడల్ బ్రిడ్జి కారణంగా పట్టణాన్ని రెండుగా విభజించినట్లు అవుతోందని అన్నారు. ఇది మంచిది కాదన్న భావన ప్రజలలో ఉందని, పిల్లర్ మోడల్‌లో ఫ్లై ఓవర్ నిర్మించాలని కోరారు. బ్రిడ్జి కింద వాహనాల రాకపోకలకు వీలుగా అదనంగా మరో రెండు మార్గాలు ఏర్పాటు చేస్తామని ఆయన హామీ ఇచ్చారని ఎమ్మెల్యే కాలవ తెలిపారు. బ్రిడ్జి ఎత్తు, వెడల్పు పెంచుతామని భరోసా ఇచ్చారని తెపారు. వారివెంట ఆర్యవైశ్య రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ నాగళ్లి రాజు, టీడీపీ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి ఉన్నారు.

బైక్‌పై కుంభమేళాకు..!



ప్రయాగరాజ్ ప్రాంతానికి చేరుకున్న రాయదుర్గం యువకులు

రాయదుర్గం రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన భాస్కర్, గణ అనే యువకులు ద్విచక్రవాహనంలో ప్రయాగరాజ్‌లో జరుగుతున్న మహా కుంభమేళాకు వెళ్లారు. త్రివేణి సంగమం వద్దకు శుక్రవారం చేరుకున్నారు. ఇక్కడ పుణ్యస్నానం చేయడాన్ని అదృష్టంగా భావిస్తున్నామని వారు అన్నారు. కాశీ, అయోధ్య తదితర పుణ్యక్షేత్రాలను సందర్శించి తిరిగి వస్తామని తెలిపారు.

బాల వసంతం

అనంత బాలోత్సవాలు ఆరంభం

శాస్త్రీయ, సాంస్కృతిక ప్రదర్శనలు

ఉత్సాహంగా తలపడిన బాలలు



పతాకాన్ని ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు



పదండి పోదాం.. ప్రదర్శనలకు..







సూపర్.. సూపర్..



ఉండమ్మా.. తీర్చిదిద్దుతా..



ఆనంద బంధనం..



బాలోత్సవంలో ప్రసంగిస్తున్న డాక్టర్ గేయానంద్



పాల్గొన్న జనం



నాటకంలో బాల కళాకారులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అనంత ఐదో బాలోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో శుక్రవారం ప్రారంభమయ్యాయి. నగరంలోని లలితకళా పరిషత్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్‌లో ఐదు వేదికలపై చిన్నారులు అద్భుత ప్రదర్శనలతో అలరించారు. శాస్త్రీయ, జానపద నృత్య ప్రదర్శనలు, నాటకాలతో అబ్బురపరిచారు. సైన్స్ ఫేర్‌లో తమ ఆవిష్కరణలను ప్రదర్శించారు. వందలాది మంది చిన్నారులు, వారి తల్లిదండ్రులు, బంధుమిత్రులు, నగర ప్రముఖుల రాకతో సంబరాలలో సందడి కనిపించింది. జేఎన్‌టీయూ వీసీ ప్రొఫెసర్ సుదర్శనరావు, మాజీ ఎమ్మెల్సీ గేయానంద్‌లు ముఖ్య అతిథులుగా హాజరై, జాతీయ పతాకావిష్కరణ చేసి బాలోత్సవాలను ప్రారంభించారు.



పాటల పల్లకిలో..

మంచిని స్వీకరించాలి..

శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని చిన్నారులు మంచికి ఉపయోగించేలా తల్లిదండ్రులు శ్రద్ధ పెట్టాలని జేఎన్‌టీయూ వీసీ సుదర్శనరావు సూచించారు. ఇంటర్నెట్, మొబైల్ ఫోన్‌లు మంచితోపాటు చెడుకూ కారణమవుతున్నాయని అన్నారు. మంచిని మాత్రమే చిన్నారులు స్వీకరించేలా తల్లిదండ్రులు జాగ్రత్త వహించాలని అన్నారు. విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకోవాలని అన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఏటా బాలోత్సవాలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు.



నాట్యం చేస్తూ..



సృజన వెలుగులోకి..

చిన్నారులలో దాగిన సృజనాత్మకతను వెలుగులోకి తెచ్చేందుకు బాలోత్సవాల వంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని మాజీ ఎమ్మెల్సీ గేయానంద్ అన్నారు. బాలోత్సవాల్లో విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొనడం అభినందనీయమని అన్నారు. ప్రదర్శనల అనంతరం చిన్నారులకు ప్రశంసా పత్రాలు, జ్ఞాపికలను అందించారు. కార్యక్రమంలో బాలోత్సవ కమిటీ అధ్యక్షురాలు షమీమ్ షఫీవుల్లా, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, కార్యనిర్వాహక కార్యదర్శి సావిత్రి, కోశాధికారి జిలాన్, న్యాయవాది రామకృష్ణారెడ్డి, కంబదూరి షేక్ నబీరసూల్, గిల్డ్ ఆఫ్ సర్వీస్ స్కూల్ అరుంధతి, ఇన్నర్ వీల్ క్లబ్ చైర్‌పర్సన్ జయంతి, మాజీ సైనికుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు షేకన్న, ఎల్‌కేపీ ప్రధాన కార్యదర్శి పద్మజ, సభ్యుడు రామగోవింద్ సాగర్, బాలోత్సవ కమిటీ సభ్యులు ఓతూరు పరమేష్, రమణయ్య, లింగమయ్య, గోవిందరాజులు, నాగేంద్ర, సరళ, దేవేంద్రమ్మ, ఏజీ రాజమోహన్ తదితరులు పాల్గొన్నారు.



ఎంత బావున్నారో..



బాల సైనికులు

పోటాపోటీగా..

జిల్లాలోని వివిధ ప్రాంతాల పాఠశాలల విద్యార్థులు బాలోత్సవాలలో భాగం పంచుకున్నారు. తమ ప్రతిభా పాటవాలను చాటేందుకు పోటీ పడ్డారు. మూడురోజులపాటు జరిగే బాలోత్సవాల ఆవరణకు 'కల్లూరు సుబ్బారావు ప్రాంగణం' అని పేరు పెట్టారు. ఒకటో వేదికకు నరసింహమూర్తి, గాజుల నారాయణస్వామి పేర్లు, రెండో వేదికకు జాకీర్ హుస్సేన్, మూడో వేదికకు షేక్ నాజర్, నాలుగో వేదికకు సీనియర్ పాత్రికేయుడు నందినేని దేవప్రసాద్, ఐదో వేదికకు మహిళా ఉద్యమ నాయకురాలు శకుంతలమ్మ పేర్లు పెట్టారు. మొదటి రోజు నిర్వహించిన పోటీలలో 1500 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అకడమిక్ అంశాలలో వ్యాసరచన, కవిత, కథా రచన, క్విజ్, మెమోరీ టెస్ట్ తదితర పోటీలు నిర్వహించారు. సాంస్కృతిక అంశాలలో జానపదం, కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు నిర్వహించారు.

మాతాశిశు మరణాల నివారణకు ఏఐ సాంకేతికత

రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్

కూడేరు పీహెచ్‌సీలో జననీ మిత్ర యాప్ ప్రారంభం



అనూషకు ఇంటి వద్ద స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కూడేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత, మాతాశిశు మరణాలను నివారించేందుకు ఏఐ సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ శుక్రవారం ప్రారంభించారు. మోడల్ పీహెచ్‌సీగా తీర్చిదిద్దేందుకు ఎంపిక చేసిన అనంతపురం జిల్లా కూడేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆయన సందర్శించారు. కూడేరు మండలంలో తల్లీబిడ్డలకు సంబంధించి కొన్ని ప్రయోగాలు చేస్తున్నారని తెలిపారు. రక్తహీనత కారణంగా ప్రసూతి మరణాలు సంభవిస్తున్నాయని, వాటిని పూర్తిగా తగ్గించేందుకు జననీ మిత్ర యాప్ ఉపయోగపడుతుందని అన్నారు. అందులో గర్భిణులు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుకోవచ్చునని అన్నారు. అనంతపురం జిల్లాలోని కూడేరు, పామిడి మండలాల్లో రక్తహీనత కేసులు ఎక్కువగా నమోదు అయ్యాయని తెలిపారు. అందుకే కూడేరును పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశామని తెలిపారు. అందుబాటులో ఉన్న డిజిటల్ సాంకేతిక వనరులను ఉపయోగించి.. రక్తహీనత, మతాశిశు మరణాలను నివారించడమే పైలెట్ ప్రాజెక్టు ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జననీ మిత్ర యాప్‌ను రాష్ట్ర వ్యాప్తంగా అమలు చేస్తామని, క్షేత్రస్థాయిలో వైద్యశాఖ సిబ్బంది బాధ్యతలు ఇచ్చామని తెలిపారు. స్వస్థి సంస్థతో కలిసి పనిచేస్తామని, ఆరు నెలల్లో మాతా శిశుమరణాల విషయంలో పెద్ద మార్పులు తీసుకువస్తామని అన్నారు. బాలింతలకు యాప్‌లోని అంశాలపై అవగాహన కల్పిస్తారని తెలిపారు. అనంతరం క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షల విధానాన్ని పరిశీలించారు. వైద్యసేవలు, మందులు, ల్యాబ్ గురించి సిబ్బందితో మాట్లాడారు. కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, అసిస్టెంట్ కలెక్టర్ వినూత్న, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవి, ప్రోగ్రాం ఆఫీసర్ యుగంధర్ పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి

సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు



నిరవధిక సమ్మె కరపత్రాలు ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 18 నుంచి చేపట్టనున్న నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు పిలుపునిచ్చారు. జేవీవీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో నిరవధిక సమ్మె కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఓబులు మాట్లాడుతూ ప్రతిసారి సమ్మె చేస్తే తప్ప వేతనాలు అందుకునే పరిస్థితి లేదన్నారు. 10 నెలల వేతనాలు ఇవ్వకపోతే కుటుంబాల పోషణ ఎలా అని ప్రశ్నించారు. ఈ నేపథ్యంలోనే కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం నిరవధిక సమ్మె చేపడుతున్నారన్నారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, కార్యదర్శి రాము, నాగరాజు, వన్నూరుస్వామి, సోము, లోకేష్, మురళి, నాగేంద్ర, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు డాక్టర్లకు మెమో

ఓపీకి డుమ్మాకొట్టిన ఫలితం

అవుట్ సోర్సింగ్ ఉద్యోగి సస్పెన్షన్



ఆస్పత్రిలో విభాగాలను తనిఖీ చేస్తున్న డాక్టరు వెంకటేశ్వరరావు

అనంతపురంటౌన్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): జిల్లా సర్వజన ఆస్పత్రిలో విధుల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వైద్యులు, సిబ్బందిపై సూపరింటెండెంట్ డాక్టరు వెంకటేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆస్పత్రిలోని పలు విభాగాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఉదయం 10గంటలకు, మధ్యాహ్నం 2.45 గంటలకు పల్మనాలజీ, సైకియాట్రీ విభాగాలను తనిఖీ చేశారు. ఆ సమయంలో పల్మనాలజీ ఓపీలో డ్యూటీలో ఉండాల్సిన డాక్టరు సౌజన్యలక్ష్మి, సైకియాట్రీ ఓపీలో ఉండాల్సిన డాక్టరు అనిల్‌కుమార్ కనిపించలేదు. దీంతో ఆ ఇద్దరు డాక్టర్లకు మెమోలు జారీ చేశారు. అలాగే అనస్తీషియా విభాగంలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి చిన్నప్పయ్య అదే విభాగంలో పనిచేస్తున్న ఓ మహిళా సిబ్బంది పట్ల అసభ్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలడంతో ఆయనను సస్పెండ్ చేసినట్లు సూపరింటెండెంట్ తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు. ఓపీలలో సంబంధిత డాక్టర్లు తప్పనిసరిగా ఉంటూ రోగులకు సేవలందించాలని ఆదేశించారు. ఇకనుంచి తనతో పాటు అడ్మినిస్ట్రేటర్, ఆర్ఎంఓలు ప్రతి రోజూ మూడుసార్లు ప్రతివిభాగాన్ని తనిఖీ చేయనున్నట్లు వెల్లడించారు. రెండుసార్లు చేసిన తప్పునే చేస్తే అలాంటి వారిపై కలెక్టరు, డీఎంఈలకు ఫిర్యాదు చేస్తామన్నారు. సీనియర్, జూనియర్ అసిస్టెంట్‌లు ప్రతి ఫైల్‌ను ఈఫైల్ విధానంలోనే పంపాలని, ఏ విభాగంలోనైనా రోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు తెలిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు.

విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు ప్రత్యేక చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా 20లక్షల మందికి కంటి పరీక్షలు

వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్



విద్యార్థులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

గార్లదిన్నె, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆరోగ్య సంరక్షణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలకు శ్రీకారం చుట్టిందని వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. మండలకేంద్రంలో శుక్రవారం కళ్లద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. మంత్రి హాజరై విద్యార్థులకు కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం ప్రధాని నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆదేశాలతో రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలల్లో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షల ద్వారా అవసరమైన విద్యార్థులకు కంటి అద్దాలు అందజేస్తామన్నారు. తీవ్రమైన సమస్యలుంటే వారికి సర్జరీ చేసి మెరుగైన వైద్య సేవలందిస్తామని తెలిపారు.

నారా లోకేశ్ డైనమిక్ లీడర్

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ డైనమిక్ లీడర్ అని సత్యకుమార్‌యాదవ్ ప్రశంసించారు. గత ప్రభుత్వంలో నాసిరకమైన ఆహారాన్ని మధ్యాహ్న భోజనంగా అందించారన్నారు. దీంతో విద్యార్థులు తరచూ అనారోగ్యానికి గురయ్యారు. ఈ సమ్యలను పరిష్కరించేందుకు లోకేశ్ మంత్రిగా బాధ్యతలు చేపట్టగానే పౌష్టికాహారాన్ని అందించేందుకు శ్రీకారం చుట్టారన్నారు. ఇంటర్మీడియేట్ వరకు పోషకాలతో కూడిన ఆహారాన్ని అందిస్తామన్నారు. స్కిల్స్ సెన్సెస్ చేసి భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి పొందేలా చదువుతోపాటు నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకున్నారని వివరించారు. శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఆధ్వర్యంలో అటల్ టింకరింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేసినట్లు వివరించారు. అనంతరం ఎమ్మెల్యే బండారు శ్రావణి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులకు ఉచిత కంటి అద్దాల పంపిణీ కార్యక్రమాన్ని శింగనమల నియోజకవర్గం గార్లదిన్నెలో మండలంలో ప్రారంభించడం ఎంతో సంతోషమన్నారు. అనంతరం రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ వీరపాండియన్ మాట్లాడుతూ విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించి కంటి అద్దాలు పంపిణీ చేయడం ద్వారా చదువుతో పాటు భవిష్యత్ బాగుంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కంటి చూపులో లోపాలు ఉన్న విద్యార్థులకు ఇకమీదట ఆ సమస్య ఉండదన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీదేవి, డీఈఓ ప్రసాద్ బాబు, ఎంపీపీ వెంకటనారాయణ, వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, మత్స్యశాఖ డీడీ శ్రీనివాస్‌నాయక్, ఎంఈఓలు తారా చంద్రానాయక్, మల్లికార్జున నాయక్, పాఠశాల ప్రిన్సిపాల్ సతీష్ పాల్గొన్నారు.

పురంలో అవినీతి పంచాయితీ

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పన్నుల శాఖ హిందూపురం సర్కిల్‌లో అవినీతి పంచాయితీ జరుగుతోంది. అక్కడ ఒక ఉన్నతాధికారి, డీసీటీఓ స్థాయి అధికారులు, సీనియర్ అసిస్టెంట్లు నాలుగు వర్గాలుగా విడిపోయినట్లు సమాచారం. జీరో వ్యాపారం చేసే కీలక డీలర్ల వద్దకు ఈ నాలుగువర్గాలు నెల మామూళ్లకోసం వెళుతున్నట్లు తెలిసింది. దీంతో అక్కడి డీలర్లు బెంబేలెత్తుతున్నారట. ఇదే క్రమంలో వర్గాలుగా ఏర్పడిన అధికారులు, సిబ్బంది నాలుగు రోజులుగా జాయింట్ కమిషనర్‌కు ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ అవినీతి పంచాయితీ నిగ్గు తేల్చేందుకు ఆ శాఖ రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులు ఒకరిని విచారణ అధికారిగా నియమించారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

అఖిలభారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్



విశాలా ఈశ్వర్‌ను సన్మానిస్తున్న పంచాయతీ సిబ్బంది

లేపాక్షి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలోని శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని అఖిల భారత పంచాయతీ పరిషత్ చైర్‌పర్సన్ విశాలా ఈశ్వర్ అన్నారు. శుక్రవారం ఆలయాన్ని ఆమె సందర్శించారు. అర్చకులు.. ఆలయ చరిత్ర, విశేషాలను వివరించారు. అనంతరం దుర్గావీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం విశాలా ఈశ్వర్‌ను సత్కరించారు.

అప్పు మీద తప్పు

అప్పులు తీర్చడానికే అంతం..?

సావిత్రమ్మ హత్యకేసు ఛేదన

పోలీసుల అదుపులో నిందితుడు




సావిత్రమ్మ (ఫైల్)

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వ్యసనాలకు బానిసైన ఓ వ్యక్తి దొంగగా మారాడు. ఈక్రమంలో ఓ మహిళను సైతం హత్య చేశాడు. ఈనెలలో నగర శివారులో ఓ మహిళ హత్య జరిగింది. ఈ కేసులో కీలక నిందితుడిని నాలుగో పట్టణ పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. పోలీసుల విచారణలో అతను అప్పుల నేపథ్యంలోనే ఈ హత్యకు పాల్పడినట్లు చెప్పుకొచ్చినట్లు తెలిసింది. యాసర్ అనే వ్యక్తి రూ.5లక్షల వరకు అప్పులు చేశాడు. రుణదాతల నుంచి ఒత్తిళ్లు అధికమయ్యాయి. ఈ క్రమంలో అతడి భార్య ఎలాగైనా సరే అప్పు తీర్చేయ్ అంది. దీంతో టీచర్స్ కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ గొంతును కత్తితో కోసి హత్య చేశాడు. ఆమె మెడలోని ఐదుతులాల బంగారు గొలుసులను లాక్కెళ్లాడు. బంగారు నగలను తాకట్టు పెట్టే క్రమంలోనే పోలీసులు యాసర్‌ను అదుపులోకి తీసుకుని, వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పట్టపగలే..

నగర శివారులోని టీచర్స్‌కాలనీలో ఒంటరిగా నివాసముంటున్న బొమ్మాళి సావిత్రమ్మ(63)ను ఈనెల ఆరో తేదీ పట్టపగలే గొంతుకోసి హత్య చేశారు. మధ్యాహ్నం 1.30 నుంచి 4గంటల మధ్యలో ఈ హత్య జరిగింది. సావిత్రమ్మ భర్త ఓబులేసు అటవీశాఖలో పనిచేస్తూ రిటైర్డ్ అయ్యారు. కొన్నేళ్ల కిందటే ఆయన మృతి చెందారు. అప్పటి నుంచి ఆమె ఒంటరిగా ఉంటోంది. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తె సంతానం. పెద్దకుమారుడు విజయ్‌కుమార్ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. ఆయన ప్రస్తుతం తన కుటుంబంతో కోవూరునగర్‌లో నివాసముంటున్నాడు. రెండో కుమారుడు జయకుమార్, కుమార్తె పూర్ణిమ అమెరికాలో ఉంటున్నారు. పెద్ద కుమారుడు విజయ్‌కుమార్ ఆరో తేదీ మధ్యాహ్నం తన తల్లికి భోజనం క్యారియర్ ఇచ్చి వెళ్లాడు. సాయంత్రం 4.30గంటల సమయంలో ఇంట్లో పనులు చేయడానికి పనిమనిషి రమణమ్మ వచ్చింది. ఇంట్లో రక్తపు మడుగులో ఉన్న సావిత్రమ్మను చూసి ఆందోళనతో కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. వారు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సావిత్రమ్మ గతంలో అంగన్‌వాడీ టీచర్‌గా పనిచేసినట్లు చెబుతున్నారు. 2015లో ఆమె ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు సమాచారం.

మహిళపై కత్తితో దాడి



బాధితురాలిని ఆసుపత్రికి తీసుకెళ్తున్న మహిళా పోలీసు

పెనుకొండ టౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక నారాయణమ్మ కాలనీలో నివాసముంటున్న బ్యూటీపార్లర్ నిర్వాహకురాలు శైలజపై గుర్తుతెలియని వ్యక్తి శుక్రవారం కత్తితో దాడి చేశాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు... నారాయణమ్మ కాలనీలో శైలజ ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నివాసం ఉంటున్నారు. అందులో పైపోర్షన్‌లో నివాసం ఉంటూ కింద పోర్షన్‌లో బ్యూటీపార్లర్ నిర్వహిస్తున్నారు. ఈమె భర్త శ్రీనివాసులు లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఎప్పటిలాగే శుక్రవారం ఉదయం శైలజ నివాసం ఉంటున్న ఇంటికి గడియపెట్టి బ్యూటీపార్లర్‌ను తెరిచేందుకు కిందకు వచ్చారు. అనంతరం పై పోర్షన్‌కు వెళ్లారు. అప్పటికే గుర్తుతెలియని వ్యక్తి ఇంట్లో జొరబడి ఉన్నాడు. వాకిలి తీసి లోనికి వెళ్లేసరికి శైలజ గొంతును పట్టుకుని కిచెన్‌లోనే ఉన్న చాకుతో చేతివేళ్లపై దాడి చేశాడు. ఆమె కేకలు వేయడంతో కిందకు పరుగులు తీశాడు. స్థానికులు అతన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా తప్పించుకుని పారిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని సమీపంలోని సీసీకెమెరాలు పరిశీలించిన ప్రయోజనం లేకపోయింది. గుర్తుతెలియని వ్యక్తి టీషర్ట్, షార్ట్‌తో వచ్చినట్లు స్థానికులు తెలిపారు. గాయపడిన శైలజను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

నేడు మెగా జాబ్‌మేళా

మడకశిరటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మధుగిరి రోడ్డులో శనివారం ఉదయం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తెలిపారు. పట్టణంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9 గంటలకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. సాయంత్రం 6 గంటల వరకు కొనసాగుతుందన్నారు. దాదాపు 50 కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి పాల్గొన్నారు.

మహిళ అదృశ్యం..కేసు

పుట్టపర్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బత్తలపల్లి గ్రామానికి చెందిన మహిళ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై లింగన్న తెలిపారు. బత్తలపల్లి గ్రామానికి చెందిన వినోద్‌కుమార్ భార్య కావ్య ఈనెల 9న సాయంత్రం 6గంటలకు ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయినట్లు భర్త ఫిర్యాదు చేశాడన్నారు. ఆ మేరకు కేసునమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు. ఆమె అచూకీ తెలిసిన వారు 9440796839 నంబరులో సమాచారం ఇవ్వాలన్నారు.

మంటలు ఆర్పడానికి వెళ్లి వృద్ధుడి మృతి

ముదిగుబ్బ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెత్తకు పెట్టిన నిప్పు మామిడి చెట్ల వైపు వస్తుందని భావించిన ఓ వృద్ధుడు మంటలు ఆర్పడానికి వెళ్లి, అందులోనే పడి మృతి చెందిన సంఘటన స్థానిక కస్తూర్బా కాలనీ సమీపంలో జరిగింది. ముదిగుబ్బ ఏఎస్ఐ బాబు నాయక్ తెలిపారు. ఏఎస్ఐ తెలిపిన మేరకు మండల కేంద్రంలోని సాయినగర్‌కు చెందిన కొలిమి నాగప్ప(84) స్థానిక కస్తూర్బా కాలనీ సమీపంలో మామిడి చెట్లను లీజుకు తీసుకొని కాపలాగా ఉండేవాడు. గుర్తు తెలియని వ్యక్తులు శుక్రవారం తోట సమీపంలోని గడ్డికి నిప్పు పెట్టారు. దీంతో మంటలు మామిడి చెట్లకు వ్యాపిస్తాయన్న ఆందోళనతో వాటిని ఆర్పడానికి వెళ్లి మంటల్లో చిక్కుకుని మృతి చెందాడన్నారు. మృతుడి మనవడు రామాంజనేయులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు.

గేమ్ చేంజర్..!

వాట్సాప్‌లో ఒక్క మెసేజ్‌తో 161 సేవలు

- ధ్రువపత్రాలు మొదలు.. ఫిర్యాదుల వరకూ..
- నేరుగా సంబంధిత శాఖలకే సమాచారం
- ప్రజాసేవకు కూటమి
- ప్రభుత్వం సాంకేతిక హంగులు


కళ్యాణదుర్గం/ధర్మవరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ప్రజా సేవకు సాంకేతిక సొబగులు అద్దుతోంది. ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు వీలుగా మనమిత్ర పేరుతో వాట్సాప్ గవర్ననెన్స్‌కు నడుంబిగించింది. వాట్సాప్‌లో హాయ్ అని టైప్ చేసి 95523 00009 సెల్ నంబరును పంపితే చాలు 161 రకాల పౌర సేవలు అందుబాటులోకి వస్తాయి. తెలుగు భాషలో ప్రతి ఒక్కరికి అర్థమయ్యేలా వివరాలు పొందుపరిచి పౌరసేవలు అందేలా ఏర్పాట్లు చేశారు.

నేరుగా సంబంధిత శాఖలకే సమాచారం

వాట్సాప్‌లో దరఖాస్తుదారుడు కోరిన పౌరసేవ ఏ శాఖ పరిధికి చెందుతుందో ఆ శాఖ అధికారులకే దరఖాస్తు వెళ్తుంది. ఏ సేవకు ఎంత సమయంలో ఇస్తున్నారన్న అంశం కూడా ఆయా శాఖల ఉన్నతాధికారులకు తెలిసే అవకాశం ఉంది. కోరిన సేవలు అందించడంలో జాప్యం చేస్తే ఉన్నతాధికారులకు వెంటనే తెలుస్తుంది. దీంతో వారు వేగవంతానికి చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. ఫలితంగా ఆయా సేవల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే బాధ తప్పుతుంది.

మొత్తం 520 రకాల సేవలు

వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మొత్తం 520 రకాల సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తేవాలని భావిస్తోంది. అందులో భాగంగా తొలి విడతగా 161 రకాల పౌర సేవలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. మలివిడతలో మరిన్ని సేవలను అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపింది. తొలివిడతలో దేవదాయ, ఇంధన, ఏపీఎస్ ఆర్టీసీ, రెవెన్యూ, మున్సిపల్, సీఎంఆర్ఎఫ్, వైద్య, ఆరోగ్య, పోలీసు, సీడీఎంఏ తదితర శాఖల్లో ఈ సేవలు మొదలయ్యాయి. ఉదాహరణకు దేవదాయశాఖకు సంబంధించిన వివిధ ఆలయాల్లోని సేవలు, టికెట్ల బుకింగ్, ఆర్టీసీ రిజర్వేషన్, విద్యుత్ బిల్లుల చెల్లింపు, కొత్త కనెక్షన్ కోసం దరఖాస్తు, పాతకనెక్షన్ కోసం మార్పు ఇలా అనేక రకాల సేవలు వాట్సాప్ ద్వారా ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది. పర్యాటక సేవల్లో భాగంగా రాష్ట్రంలోని పర్యాటక ప్రదేశాల సమాచారాన్ని వాట్సాప్‌లో పంపిస్తారు. కావాల్సిన ప్రదేశాన్ని ఎంపిక చేసుకుని టికెట్లు, వసతి సహా అన్నీ పొందవచ్చు. రెవెన్యూ విభాగం ద్వారా మనకు కావాల్సిన ఓబీసీ, ఈడబ్ల్యూఎస్, ఆదాయ, నోఎర్నింగ్ ఇలా వివిధ శాఖలకు సంబంధించిన అనేక సర్టిఫికెట్లు, ట్రేడ్ లైసెన్స్‌లు, రెవెన్యూశాఖకు సంబంధించి ల్యాండ్ రికార్డులు, వివిధ సర్టిఫికెట్లు వాట్సాప్ ద్వారా పొందవచ్చు. ముఖ్యమంత్రి సహాయ నిధికి చేసిన దరఖాస్తుల స్టేటస్ తెలుసు కోవచ్చు. ఆస్తిపన్నుల వంటివి ఈ అధికారిక వాట్సాప్ ద్వారాచెల్లించవచ్చు. ఏపీఎస్ ఆర్టీసీ టికెట్ బుకింగ్, క్యాన్సిలేషన్, జర్నీ, రిమైండర్, ట్రాకింగ్‌సర్వీసు, రిఫండ్, ఫీడ్ బ్యాక్ తదితర సేవలు దీని ద్వారా పొందవచ్చు.



వాట్సాప్ గవర్నెన్స్ యాప్

సేవలు ఇలా...

రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా 9552300009 నెంబరును కేటాయించింది. ఈ నెంబరును మొబైల్‌లో యాడ్ చేసుకోవాలి. ప్రజలు వారికి కావాల్సిన సేవలు పొందడానికి ఏవైనా ఫిర్యాదులు ఉంటే తెలియజేయడానికి ఆ నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేయాలి. వెంటనే సేవను ఎంచుకోండి అనే మెసేజ్ ఆప్షన్ వస్తుంది. దాన్నిక్లిక్ చేస్తే ఒక మెనూ వస్తుంది. ఆ మెనూలో మనకు కావాల్సిన విభాగాన్ని ఎంచుకుని, కావాల్సిన సేవలను ఎంచుకోవాల్సిన ఉంటుంది. అవి సంబంధిత శాఖ అధికారుల లాగిన్‌లోకి వెళతాయి. వాటి ఆధారంగా అధికారులు పరిష్కారం, సేవలు అందిస్తారు.

కార్యాలయాలకు వెళ్లాల్సిన పనిలేదు

మన మిత్ర నంబరు(9552300009) ద్వారా అన్ని రకాల సేవలను సద్వినియోగం చేసుకున్నట్లయితే, కార్యాలయాల వద్దకు వెళాల్సిన అవసరం ఏ మాత్రం ఉండదు. ఇంట్లోనే కూర్చొని సెల్‌ఫోన్‌లోనే అన్నీ సేవలను పొందేందుకు అవకాశం ఉంటుంది. ఆ దిశగా అధికారులు కూడా అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది. కాని ఏ ఒక్క అధికారి కూడా వీటిపై ప్రత్యేక శ్రద్ధ కనపరచడం లేదు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్నప్పటికీ క్షేత్రస్థాయిలో పూర్తిగా అమలుకు నోచుకోలేదు. అధికారులే ప్రత్యేక దృష్టి సారించి ప్రజలందరికీ అవగాహన కల్పిస్తే వ్యయప్రయాసలు తప్పే అవకాశం ఉంటుంది.

ఆశలు మోడు..!

చీనీ చెట్లకు విల్ట్ తెగులు

- నిలువునా ఎండిపోతున్న దుస్థితి
- కాపు బాగా వచ్చిన చెట్లపైనే ప్రభావం
- కాపాడుకునేందుకు అన్నదాత అష్టకష్టాలు
- కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకుంటున్న వైనం
- అవగాహన కల్పించని అధికారులు

కూడేరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): లక్షల రూపాయలు అప్పులు చేసి సాగుచేసిన చీనీ చెట్లు కళ్ల ముందే ఎండిపోతుంటే అన్నదాత బాధ వర్ణనాతీతం. పంటను కంటికి రెప్పలా కాపాడుకుని తీరా కాపునకు వదిలిన సమయంలో చెట్లు ఎండిపోతున్నాయి. అది కూడా దిగుబడి బాగా వచ్చిన చెట్లే దెబ్బతింటున్నాయి. దీంతో వాటిని కాపాడుకునేందుకు రైతు నానా తిప్పలు పడుతున్నాడు. అయినా చెట్లు ఎండిపోయి, మోడుగా మిగులుతున్నాయి. జిల్లావ్యాప్తంగా 92,966 ఎకరాల్లో చీనీ సాగవుతోంది. కూడేరు, గార్లదిన్నె, గుత్తి, శింగనమల, పామిడి, తాడిపత్రి, బుక్కరాయసముద్రం, ఆత్మకూరు, రాప్తాడు, తదితర మండలాల్లో అత్యధిక విస్తీర్ణంలో సాగు చేస్తున్నారు. చెట్లు 20 ఏళ్లపాటు కాపు కాస్తాయి. తెగుళ్ల బారినపడి ఆరేడేళ్లకే చనిపోతున్నాయి. గతంలో చీనీ తోటలను శాస్త్రవేతలు పరిశీలించి, చెట్లకు సోకే తెగుళ్లు, వాటి నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై రైతులకు అవగాహన కల్పించేవారు. కొంతకాలంగా చీనీ తోటల వైపు శాస్త్రవేత్తలే కాదు, ఉద్యాన శాఖాధికారులు కూడా కన్నెత్తి చూడట్లేదని రైతులు వాపోతున్నారు. దీంతో ఎండిపోతున్న చీనీ చెట్లను కాపాడుకోవడానికి ఎరువుల దుకాణాల నిర్వాహకులు ఇచ్చే సూచనలతో వేలాది రూపాయలు ఖర్చు చేసి, మందులు వాడినా ఫలితం లేకుండాపోతోంది. ఒక్కో తోటలో 30 నుంచి 70 వరకు దిగుబడి వచ్చిన చెట్లు ఎండిపోతున్నాయి. వేలాది రూపాయలు ఖర్చు చేసి, కాపాడుకుంటున్న చెట్లు కళ్లముందే ఎండిపోతుంటే అన్నదాత ఆవేదన వర్ణనాతీతం.

విల్ట్ తెగులు సోకి...

విల్ట్ తెగులు సోకడంతోనే చీనీ చెట్లు ఎండిపోతున్నాయని ఉద్యాన శాఖాధికారులు చెబుతున్నారు. చీనీ చెట్లను కాపునకు వదిలిన సమయంలో వాటి మొదళ్ల వద్ద మట్టిని తీసి, పాదులు చేయకుండానే సేంద్రియ, రసాయన ఎరువులను నేరుగా అందించడంతో విల్ట్ వ్యాధి సోకుతోంది. దీంతో చెట్టు వేరు కుళ్లిపోయి దిగుబడి బాగా వచ్చిన చెట్లు ఎండిపోయి, కాయలు పసుపు రంగులోకి మారి ఎండిపోతున్నాయి. కొంతకాలంగా తోటల్లో చీనీచెట్లు ఎండిపోతున్నా రైతులకు అవగాహన కల్పించే నాథుడే కరువయ్యాడు.


ఎండిపోయిన చీనీ చెట్టు

30 చెట్లు దెబ్బతిన్నాయి..


450 చీనీ చెట్లు సాగుచేశా. దిగుబడి ఆశాజనకంగా వచ్చింది. సంతోషంతో ఉన్న సమయంలో ఒక్కో చెట్టు ఎండిపోతుండడంతోపాటు వాటిలోని కాయలు పసుపు రంగులోకి మారిపోతున్నాయి. ఇలా 30 చెట్ల వరకు దెబ్బతిన్నాయి. మందుల షాపు వారిని సంప్రదిస్తే పదివేల రూపాయల విలువైన మందులు ఇచ్చారు. వాటిని చెట్లకు వదిలినా ఫలితం దక్కలేదు. ఏం చేయాలో దిక్కుతోచట్లేదు.

-ఆవుల ఎర్రిస్వామి, చీనీ రైతు, పి. నాగిరెడ్డిపల్లి

చెట్లు ఎండిపోతున్నాయి..


నా పొలంలో 250 చీనీ చెట్లు కాపునకు వచ్చాయి. ఆశించిన మేర దిగుబడి వచ్చినా చెట్లు కళ్ల ముందే ఎండిపోతుండటంతో విలవిల్లాడుతున్నాం. తోటలో 35 చెట్లు ఎండిపోవడం, మరిన్ని వాడు పట్టడంతో ఏం చేయాలో అర్థంకాక రాత్రిళ్లు నిద్ర పట్టడం లేదు. ఎన్ని చర్యలు తీసుకుంటున్నా చెట్లను కాపాడుకోలేకపోతున్నా.

-బోయ రామాంజనేయులు, చీనీ రైతు, పి. నాగిరెడ్డిపల్లి

బంబేరి వేరు మీద కట్టిన చెట్లకు తెగులు


రంగపురి అంట్ల మీద కట్టిన చీనీ మొక్కలు తెగుళ్లను తట్టుకోగలవు. జిల్లాలో ఎక్కువగా జంబేరి వేరు మీద కట్టిన అంటు మొక్కలను నాటడం కారణంగా తెగులు అధికంగా సోకుతోంది. దిగుబడి బాగా వచ్చిన చెట్లలో విల్ట్ తెగులు కనిపిస్తుంది. చెట్టు ఆకులు రాలిపోయి, ఎండిపోతుంది. తెగుళ్ల నివారణకు ఆరోగ్యంగాలేని చెట్ల వేర్ల మొదల్లో కట్ చేసి, బోర్డక్స్ పేస్ట్ పూయాలి. పశువుల ఎరువు, వేపచెక్కతోపాటు ట్రైకోడెర్మావిడిని మిశ్రమంగా కలిసి పైన నీరు చల్లి బాగా మగ్గ బెట్టి (నానబెట్టి) చెట్టుకు 5 కేజీలు వేయాలి. వ్యాధి తీవ్రత ఎక్కువగా ఉంటే సిఓసి 3 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదలు వద్ద తడపాలి. రెడోమైల్ ఎంజెడ్ 2 గ్రాములు లీటరు నీటిలో కలిపి చెట్టు మొదళ్ల దగ్గర పోయాలి. రైతులు రంగపురి అంట్లను నాటుకోవడమే మేలు.

-నెట్టికంటయ్య, ఉద్యాన శాఖాధికారి

ముగిసిన బొలికొండ బ్రహ్మోత్సవాలు


ప్రత్యేక అలంకరణలో స్వామి, అమ్మవార్లు

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తొండపాడులో వెలసిన బొలికొండ రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం వసంతోత్సవంతో ముగిశాయి. ఆలయంలో ఉదయం స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పల్లకీలో స్వామివారు, అమ్మవార్లను అధిష్టించి గ్రామవీధుల్లో మేళతాళాల మధ్య ఊరేగించారు. రాత్రి 9 గంటలకు స్వామివారికి ఊంజలసేవ నిర్వహించారు. అనంతరం స్వామివారు జక్కులచెరువుకు చేరుకుని, గ్రామంలో ఊరేగారు. వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి.

రూ.9.40 లక్షల ఆదాయం

బొలికొండ రంగనాథస్వామి దేవాలయంలో శుక్రవారం దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ ఆదిశేషునాయుడు, ఆలయ ఈఓ రామాంజనేయులు ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేపట్టారు. గత 9 రోజులు భక్తులు హుండీలో వేసిన కానుకలను లెక్కించారు. రూ.9.40 లక్షల ఆదాయం సమకూరినట్లు ఈఓ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ రంగస్వామిరెడ్డి యాదవ్, అర్చకులు, రవిస్వామి, చేతన్ వర్మ, లికిల్‌వర్మ, రాఘవేంద్రచార్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్కూళ్లలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ప్రతిజ్ఞ

అనంతపురం విద్య, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో నెలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్రా ప్రతిజ్ఞ చేయాలని డీఈఓ ప్రసాద్‌బాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. స్కూళ్లలో ఉదయం 9.30 నుంచి 11 గంటలలోపు నిర్వహించాలని అందులో పేర్కొన్నారు. స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి, ఫొటోలను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. స్వచ్ఛ నిబంధనల మేరకు తప్పనిసరిగా ప్రతి స్కూల్‌లో తప్పక అమలు చేయాలని ప్రిన్సిపాళ్లు, ప్రధానోపాధ్యాయులు, కరస్పాండెంట్లను డీఈఓ ఆదేశించారు.

బావిలో పడ్డ కారు

ఒకరి మృతి.. మరొకరికి తీవ్రగాయాలు


కారును బావి నుంచి బయటకు తీస్తున్న దృశ్యం

శింగనమల, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): నార్పల మండలం నడిమిదొడ్డి గ్రామ సమీపాన కారు అదుపుతప్పి, బావిలో పడిపోవడంతో అనంతపురానికి చెందిన షాబుద్దీన్ (40) మరణించగా.. ఇర్ఫాన్ తీవ్రంగా గాయపడ్డాడు. శింగనమల సీఐ కౌలుట్లయ్య, తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అనంతపురంలోని గుల్జార్ పేటకు చెందిన షాబుద్దీన్, ఇర్ఫాన్ జియో కంపెనిలో పని చేస్తున్నారు. కంపెనీ పని నిమిత్తం నాయనపల్లి క్రాస్ నుంచి నార్పలకు కారులో బయల్దేరారు. నడిమిదొడ్డి గ్రామ సమీపాన ఆవును తప్పించే ప్రయత్నంలో కారు అదుపు తప్పి రోడ్డు పక్కనున్న బావిలో పడిపోయింది. బావి నీటిలో కారు మునిగిపోయింది. అందులో ఉన్న షాబుద్దీన్ ఊపిరాడక మృతి చెందాడు. ఇర్ఫాన్ కారు డోర్ గ్లాస్ కాసత తెరుచుకుని ఉండడంతో బయటకు వచ్చే ప్రయత్నం చేశాడు. అయినా వీలుకాలేదు. సమాచారం అందగానే సీఐ కౌలుట్లయ్య, ఎస్ఐలు విజయ్‌కుమార్, సాగర్ హుటాహుటిన ప్రమాద స్థలానికి చేరుకున్నారు. బావిలో ఉన్న కారును ఎక్స్‌కవేటర్ సాయంతో బయటకు తీశారు. గాయపడ్డ ఇర్ఫాన్‌ను ఆస్పత్రికి తరలించారు. షాబుద్దీన్‌కు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నారు.

ఘనంగా సేవాలాల్ జయంత్యుత్సవాలు

- స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు
- హాజరైన మహారాష్ట్ర మంత్రి సంజయ్‌భావ్ రాథోడ్

గుత్తి రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండంలోని సేవాఘడ్‌లో బంజారాల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహారాజ్ జయంత్యుత్సవాలు శుక్రవారం ఘనంగా జరిగాయి. స్వామివారికి వేకువజామునే పంచామృతాభిషేకం చేసి, వివిధ పుష్పాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాతా జగదాంబ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉత్సవ మూర్తులను సాయంత్రం పల్లకిలో కొలువుదీర్చి మేళతాళాలతో ఊరేగించారు. మహారాష్ట్ర మంత్రి సంజయ్‌భావ్ రాథోడ్ వేడుకలలో పాల్గొన్నారు. ట్రస్టు అధ్యక్షుడు జగనాథరావు, సభ్యులు అశ్వత్థనాయక్, కేశవనాయక్, రవీంద్రనాయక్, ఆర్డీఓ శ్రీనివాసులు ఆయనకు స్వాగతం పలికారు. స్వామి, అమ్మవార్లకు మహారాష్ట్ర మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మంత్రిని ట్రస్టు సభ్యులు ఘనంగా సత్కరించారు. వేడుకలలో భాగంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు.

సేవాలాల్ మార్గాన్ని అనుసరించాలి: మంత్రి సత్యకుమార్

సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని బంజారాలు అనుసరించాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ సూచించారు. సేవాఘడ్‌లో సంత్ సేవాలాల్ మహారాజ్ 286వ జయంత్యుత్సవాలను శుక్రవారం రాత్రి ఆయన ప్రారంభించారు. ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సభ్యులు అశ్వత్థ నాయక్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేశారు. సేవాఘడ్‌ను పవిత్ర క్షేత్రం తీర్చిదిద్దడానికి కృషి చేస్తున్నామని మంత్రి అన్నారు. ఎన్డీఏ ప్రభుత్వం సేవాఘడ్‌కు రూ.50 లక్షల నిధులు ప్రకటించిందని అన్నారు. సేవాఘడ్ పవిత్ర క్షేత్రమని గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం అన్నారు. బంజారా జాతి పురోగతికి మార్గోపదేశం చేసిన మహానీయుడు సంత్ సేవాలాల్ మహారాజ్ అని అన్నారు. సేవాలాల్ చూపిన మార్గంలో నడవాలని బంజారాలకు టీడీపీ జిల్లా అధ్యక్షుడువెంకటశివుడు యాదవ్ సూచించారు. కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీనివాసులు, తహసీల్దారు ఓబులేసు, ట్రస్టు సభ్యులు రవీంద్ర నాయక్, ఎస్కే రామచంద్ర నాయక్, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ సురేష్ బాబు, ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్, ఈఓఆర్డీ శివాజీ రెడ్డి పాల్గొన్నారు.


ప్రత్యేక అలంకరణలో పూజలు అందుకుంటున్న సేవాలాల్ మహారాజ్


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న ట్రస్టు అధ్యక్షుడు జగన్నాథరావు, ఫొటోలో మంత్రి సత్యకుమార్ యాదవ్, ఎమ్మెల్యే గుమ్మనూరు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్

హత్యాయత్నం కేసులో భర్త అరెస్ట్

పరిగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): భార్యను చంపేందుకు యత్నించిన భర్తను శుక్రవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. కరియప్ప, నిర్మలమ్మకు 26 కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. మనస్పర్థల నేపథ్యంలో దంపతులు నాలుగేళ్ల కిందట విడిపోయారు. ఈక్రమంలో నిర్మలమ్మ హిందూపురంలో, కరియప్ప మండలంలోని బీచిగానిపల్లిలో నివాసం ఉంటున్నారు. కుమార్తెలు ఇద్దరూ నిర్మలమ్మ వద్దే ఉంటున్నారు. ఇటీవల పెద్దకుమార్తె వివాహం నిశ్చయమైంది. ఈనేపథ్యంలో కుమార్తె లగ్నపత్రికను తండ్రి అయిన కరియప్పకు ఇవ్వడానికి నిర్మలమ్మ గురువారం బీచిగానిపల్లికి వచ్చింది. ఇంటికి వచ్చిన ఆమెను చూసిన కరియప్ప ఆగ్రహంతో నా కుమార్తె పెళ్లి చేయడానికి నీవెవరు అంటూ వాగ్వాదానికి దిగాడు. ఈక్రమంలోనే పక్కనే ఉన్న కొడవలితో ఆమె భుజం, చేయిపై నరికాడు. ఆమె కేకలు వేయడంతో గ్రామస్థులు అక్కడికి రాగా కరియప్ప పరారయ్యాడు. రక్తపు మడుగులో ఉన్న నిర్మలమ్మను హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయంపై కేసు నమోదు చేసుకుని నిందితుడి కోసం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. కొడికొండ-శిర హైవే సమీపంలో కరియప్ప ఉండగా శుక్రవారం ఉదయం అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ రంగడుయాదవ్ తెలిపారు.

రైతులకు వ్యాపారి కుచ్చుటోపీ

బెళుగుప్ప, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల రైతుల నుంచి కళ్యాణదుర్గానికి చెందిన వ్యాపారి మొక్కజొన్న కొనుగోలు చేసి, డబ్బులివ్వకుండా కుచ్చుటోపీ పెట్టాడు. మండలంలోని యలగలవంక, గుండ్లపల్లి, నరసాపురం, రమణేపల్లితో పాటు కళ్యాణదుర్గం, ఉరవకొండ తదితర ప్రాంతాల్లో 90 మందికిపైగా మోసపోయారు. రైతులు పండించిన మొక్కజొన్న పంటను కొనుగోలు చేసిన వ్యాపారి.. డబ్బు అడిగితే అదిగో.. ఇదిగో అంటూ కాలయాపన చేశారు. ఆఖరుకు కోర్టు నుంచి ఐపీ నోటీసులు పంపాడు. దీంతో రైతులు లబోదిబోమంటున్నారు.

న్యూస్ బాక్స్

కుక్కల దాడిలో 40 గొర్రెపిల్లల మృతి

రూ.2 లక్షలు నష్టం



మృతిచెందిన గొర్రెపిల్లలు

కనగానపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన కనగానపల్లిలో శుక్రవారం కుక్కల దాడిలో 40 గొర్రె పిల్లలు మృతి చెందాయి. దీంతో కాపరికి రూ.2 లక్షల నష్టం వాటి ల్లింది. గ్రామానికి చెందిన పూజారి బీరప్ప గొర్రెలు మేపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. రోజు మాదిరిగానే గొర్రెపిల్లలను గూడులో ఉంచి మేతకు వెళ్లాడు. సాయంత్రం గూడు వద్దకు వచ్చి చూడగా గొర్రెపిల్లలు కుక్కల దాడిలో మృతి చెందాయి.

18న విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాలకు ఈనెల 18న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ లక్ష్మీనారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రమైన రామగిరి సమీపంలోగల 220 కేవీ విద్యుత్ కేంద్రంలో ఈనెల 18న ఉదయం 9-30గంటల నుంచి మధ్యాహ్నం 2-30 గంటల వరకు సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామన్నారు. రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

గుండెపోటుతో టీడీపీ సీనియర్ నాయకుడి మృతి



చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని బసంపల్లికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తాడిమర్రి కిష్టప్ప(60) గుండెపోటుతో మృతిచెందాడు. గురువారం రాత్రి స్వగృహంలో ఉన్న ఫళంగా ఆయన తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. వెంటనే కుటుంబసభ్యులు చికిత్స నిమిత్తం ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందారని నిర్ధారించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. విషయం తెలుసుకున్న టీడీపీ మండల కన్వీనర్ ముత్యాల్‌రెడ్డి, నాయకులు చంద్రాయుడు, ప్రసాద్, వెంకటేశ్, బయన్న శుక్రవారం భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఓ వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందాడు. భాగ్యనగర్‌కు చెందిన దస్తగిరి సాబ్(74) ఈనెల 7వతేదీ మార్కెట్‌యార్డు సమీపంలో నడుచుకుంటూ వెళ్తుండగా...గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రిలో చేర్పించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య షేక్ తాహెరా ఫిర్యాదు మేరకు ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

టమోటా కిలో రూ.10

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టమోటా గరిష్ఠంగా రూ.10తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రాంప్రసాద్ తెలిపారు. శుక్రవారం మార్కెట్‌కు 525 టన్నుల టమోటా దిగుబడులు వచ్చాయని వివరించారు. కిలో సరాసరి ధర రూ.8, కనిష్ఠ ధర రూ.6 పలికినట్లు తెలిపారు.

చీనీ కాయలు టన్ను రూ.22 వేలు

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శుక్రవారం చీనీ కాయలు టన్ను గరిష్ఠంగా రూ.22,780, కనిష్ఠంగా రూ.3వేలు, సరాసరి రూ.14వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. మార్కెట్‌కు మొత్తంగా 73 టన్నుల చీనీకాయలు వచ్చాయని పేర్కొన్నారు.

ఆయుష్ ఆసుపత్రుల సమస్యలు తీర్చండి

అనంతపురంటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంతోపాటు జిల్లాలోని ఆయుష్ ఆసుపత్రులలో నెలకొన్న సమస్యలను తీర్చాలని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు ఆయుష్ డాక్టర్ల సంఘం నాయకులు విన్నవించారు. శుక్రవారం అనంతపురంలో మంత్రిని రాష్ట్ర ఆయుష్ డాక్టర్ల సంఘం నాయకులు నాగేశ్వరరావు, పోగుల కుమారయ్య, తిరుపతినాయుడు తదితరులు కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆయుష్ ఆసుపత్రులలో అనేక సమస్యలు ఉన్నాయని, దీంతో ప్రజలకు సేవలందించడం కష్టంగా మారిందని తెలిపారు. డాక్టర్లు, సిబ్బంది పోస్టులను భర్తీచేయాలని, ఆయుష్ మెడికల్ యూనిట్లను ఏర్పాటు చేయాలని, దత్తత తీసుకున్న గ్రామాలలో ఆయుష్ వైద్యసేవలు అందించేలాచూడాలని మంత్రికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు రవికుమార్, మాలిక్ పాల్గొన్నారు.

● **కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించండి**

ఎన్టీఆర్‌వైద్యసేవలో పనిచేస్తున్న సిబ్బందిని కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు నాగార్జునరెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి మంత్రికి విన్నవించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాంట్రాక్ట్ ఉద్యోగులుగా గుర్తించడంతోపాటు సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని, మరణించిన కుటుంబాలకు రూ.15లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని, రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.

22, 23 తేదీల్లో రాప్తాడులో అగ్రి షో

రాప్తాడు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాప్తాడు వద్ద జాతీయ రహదారి పక్కన జాకీ పరిశ్రమ కోసం కేటాయించిన స్థలంలో ఈనెల 22, 23 తేదీల్లో రైతు బడి సంస్థ నిర్వాహకులు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు బడి అగ్రి షో సదస్సు నిర్వహిస్తున్నట్లు రాప్తాడు టీడీపీ మండల ఇన్‌చార్జ్ ధర్మవరపు మురళి తెలిపారు. అగ్రిషో సదస్సు ఏర్పాట్లకు శుక్రవారం రాప్తాడులో భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జాతీయ రహదారి పక్కన నిర్వహించే ఈ అగ్రి షో సదస్సులో 300 కంపెనీలు అత్యాధునిక వ్యవసాయ యంత్రాలు, పరికరాలను ప్రదర్శిస్తాయని అన్నారు. అన్ని రకాల పంటలు, తోటలు, పశువుల పెంపకంపై సమగ్ర సమాచారాన్ని రైతులకు అందుబాటులోకి తెచ్చేందుకు స్టాళ్ల ఏర్పాటు చేస్తారని వివరించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ కొండప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సర్పంచులు తిరుపాలు, శీనయ్య, అగ్రి షో ప్రతినిధులు నవీన్, హరీష్, శివ పాల్గొన్నారు.



అగ్రి షో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఊరూరా రోడ్లు

- వైసీపీ పాలనలో గోతుల రోడ్లతో జనం విలవిల
- కూటమి ప్రభుత్వంలో అభివృద్ధికి చర్యలు



అనంతపురం రూరల్ మండలం ఎ. నారాయణపురంలో చేపట్టిన రోడ్డు నిర్మాణం

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం కొలువుదీరాక గ్రామ పంచాయతీల్లో రోడ్లకు మహర్దశ పట్టుకుంది. గత వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీలను పూర్తిగా నిర్వీర్యం చేసింది. నిధులివ్వకపోవడంతో రోడ్లు దెబ్బతిన్నాయి. పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. ఆ రోడ్లలో ప్రజలు ప్రత్యక్ష నరకం అనుభవించారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక పంచాయతీలకు నిధులు కేటాయించింది. ఆర్థిక సంఘం నిధులను మళ్లించకుండా పూర్తిగా పంచాయతీల అభివృద్ధికే వినియోగించారు. దీంతో రోడ్ల పనులు చకచకా సాగిపోతున్నాయి. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 1044 పంచాయతీలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం పంచాయతీల అభివృద్ధిని విస్మరించింది. పైసా కూడా నిధులివ్వలేదు. ఆర్థిక సంఘం నిధులను సైతం మళ్లించింది. వీధిలైట్లు కూడా వేయలేని పరిస్థితి ఏర్పడింది. ఆఖరుకు పంచాయతీల్లో సర్పంచ్‌లు తిరగలేక ముఖం చాటేశారు. వైసీపీ మద్దతు సర్పంచ్‌లు సైతం ప్రభుత్వంపై తిరగబడే పరిస్థితి ఏర్పడింది. పలువురు విమర్శలు సైతం గుప్పించారు.

పల్లెలకు పండగే..

కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రోడ్ల అభివృద్ధికి భారీ ప్యాకేజీని ప్రకటించింది. జిల్లాలో వందల కిలోమీటర్ల మేర సీసీ, బీటీ రోడ్ల నిర్మాణం చేపట్టారు. పనులు శరవేగంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా పూర్తి చేస్తామని అధికారులు చెప్పుకొస్తున్నారు.

లక్ష్యాలు అందుకుంటాం: జహీర్ అస్లాం, ఎస్ఈ, పంచాయతీరాజ్



ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తిచేశాం. వచ్చే ఏడాది చేపట్టాల్సిన పనులకు సంబంధించి అనుమతుల మంజూరుకు చర్యలు చేపడుతున్నాం.

కాలిపోయిన 320 చీనీ చెట్లు



కాలిపోయిన చీనీచెట్లను చూపుతున్న రైతు రఘునాథరెడ్డి

ఆత్మకూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన రఘునాథరెడ్డి అనే రైతు తోటలోని 320 చీనీ చెట్లు కాలిపోయాయి. శుక్రవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో మూడు ఎకరాల్లో సాగు చేసిన చీనీ చెట్లు కాలిపోయయాయని రైతు తెలిపారు. సుమారు రూ.4 లక్షల విలువ చేసే కాయలతో పాటు చెట్లు కూడా పూర్తిగా కాలిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. చెట్లతో పాటు డ్రిప్ పరికరాలు పూర్తిగా కాలిపోయాని వివరించారు. ఐదు సంవత్సరాలు కంటికి రెప్పలా కాపాడుకున్నట్లు తెలిపారు. వచ్చే ఏడాది నుంచి పంట పూర్తిగా వచ్చే అవకాశం ఉందని, అంతలోనే ప్రమాదం చోటు చేసుకుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికా రులు పరిశీలించి పరిహారం వచ్చేలా చూడాలని కోరారు.

నేటి తరానికి మార్గదర్శి దామోదరం సంజీవయ్య



దామోదరం సంజీవయ్య చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న జడ్పీ చైర్‌పర్సన్, సీఈఓ.. ఆర్ట్స్ కళాశాల, ఎస్కేయూ, మండల పరిషత్ కార్యాలయంలో నివాళి అర్పిస్తున్న అధికారులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దివంగత మాజీ సీఎం దామోదరం సంజీవయ్య నేటి తరానికి మార్గదర్శకులని జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బోయ గిరిజమ్మ పేర్కొన్నారు. శుక్రవారం దామోదరం 104 జయంతిని పురస్కరించుకుని జిల్లాపరిషత్ మీటింగ్ హాల్‌లో ఘనంగా చేశారు. ఆయన చిత్రపటానికి ఆమెతోపాటు సీఈఓ రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంత రం చైర్ పర్సన్ మాట్లాడుతూ.. ఆయన సీఎంగా రాష్ట్రానికి ఎంతగానో సే వలు అందించారని కొనియాడారు. జిల్లా కేంద్ర గ్రంథాలయంలో వేడుకగా చేశారు. గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ, ఇతర ఉద్యోగులు, సిబ్బంది దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● అనంతపురం సెంట్రల్: విలువలకు ప్రతిరూపమైన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య ఆర్ట్స్ కళాశాల పూర్వపు విద్యార్థి కావడం గర్వకారణమని ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు పేర్కొన్నారు. ఆర్ట్స్ కళాశాలలో ఘనంగా నివాళి అర్పించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పద్మశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ శశాంకమౌళి, అసోసియేషన్ నాయకులు శ్రీనివాసులు, కృష్ణమోహన్, పాల్, లైబ్రేరియన్ డాక్టర్ కేశాలు, అసోసియేట్ ప్రొఫెసర్ బసయ్య, నాయకులు రజిత, పుష్పలత, వినోద్‌కుమార్, నరేష్, మునిస్వామి, నాగన్న, రంగనాయకులు పాల్గొన్నారు.

దామోదరం జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలి

విద్యార్థిగా, అధికారిగా, ప్రజాప్రతినిధిగా దేశం గర్వించిన మాజీ ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకోవాలని ఎస్కేయూ తెలుగుశాఖ ప్రొఫెసర్ బాలసుబ్రహ్మణ్యం విద్యార్థులకు సూచించారు. ఎస్కేయూ ప్రధాన ముఖద్వారం వద్ద దామోదరం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో అకడమిక్ కన్సల్టెంట్స్ డాక్టర్ అంకన్న, విజయ్, ఉద్యోగులు సుదర్శన్, సునీల్, తిరుమలేష్, నాగేంద్ర, శాంతిరాజ్, వెంకటేష్, హేమంత్, శివ తదితరులు పాల్గొన్నారు.

అనంతపురంరూరల్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మాజీ ముఖ్యమంత్రి దామోదరసంజీవయ్య జయంతిని నిర్వహించారు. ఎంపీడీఓ దివాకర్, ఎంపీపీ వరలక్ష్మి, జడ్పీటీసీ చంద్రకుమార్ తదితరులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

కూటమి రాకతో రోడ్లకు మహర్దశ: ఎమ్మెల్యే



సీసీ రోడ్డు శిలఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో గతుకుల రోడ్లతో జనం నరకం చూశారని, కూటమి రాకతోనే వాటికి మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రుద్రంపేట పంచాయితీలో రూ.29.50 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..గత ఐదేళ్లలో ప్రజల అవస్థలు చూసి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రోడ్ల నిర్మాణాలకు తొలిప్రాధాన్యం ఇచ్చారన్నారు. గుంతలు పడ్డ రోడ్లకు మరమ్మత్తులతో పాటు నూతనంగా రోడ్డు నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. గత ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న రుద్రంపేట-తగరకుంట రోడ్డు తాము వచ్చిన తరువాత పూర్తిచేశామన్నారు. 80 అడుగుల రోడ్డు రూ.3కోట్లతో నిర్మించామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దివాకర్, పంచాయితీ కార్యదర్శి హిదయతుల్లా, నాయకులు భక్తవత్సలం నాయుడు, బాష, శ్రీనివాస్‌రెడ్డి, మారుతీ నాయుడు, బాలప్ప, నాగభూషణం, ఆది, ముత్యాలు, గంగారామ్, గోపాల్ గౌడ్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

దామోదరం సంజీవయ్యకు ఎమ్మెల్యే ఘన నివాళులు

అనంతపురం అర్బన్: స్థానిక అర్బన్ టీడీపీ కార్యాలయంలో శుక్రవారం మాజీ ముఖ్యమంత్రి దివంగత దామోదరం సంజీవయ్య జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంజీవయ్య చిత్రపటానికి ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు బాలాంజనేయులు, స్వామిదాస్, పరమేశ్వరన్, వన్నూరప్ప, నెట్టెం బాలకృష్ణ పాల్గొన్నారు.

మహాకుంభాభిషేక వేడుకలకు శ్రీకారం



పూజలందుకుంటున్న శ్రీదేవి, భూదేవి సమేత లక్ష్మీ వెంకటేశ్వరస్వామి, శోభాయాత్రలో భక్తులు

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ఎఫ్ రోడ్డులోని లక్ష్మీ వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద మహాకుంభాభిషేక వేడుకల కు శుక్రవారం శ్రీకారం చుట్టారు. ఆలయ ఆవరణలో కలశపూజలతోపాటు వందలాది మంది భక్తులు పురవీధుల గుండా శోభాయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గోవింద నామస్మరణతో పురవీధులు పులకించాయి. సాయంత్రం ఆలయంలో గణపతిపూజ, ఉపచార పూజలు నిర్వహించారు. వేడుకల్లో భాగంగా శనివారం 108 జంటలతో 27 హోమకుండములలో గణపతి, నవగ్రహ, లక్ష్మీనారాయణ హోమాలు నిర్వహించనున్నారు. సాయంత్రం విద్యారణ్య భారతిస్వామి హాజరై అనుగ్రహ భాషణం చేయనున్నారు. కార్యక్రమంలో ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

చేపల పెంపకంపై ప్రత్యేక దృష్టి

చెన్నేకొత్తపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): చెరువుల్లో చేపల పెంపకంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారించిందని జిల్లా మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని నాగసముద్రం, మేడాపురం చెరువుల్లోకి శుక్రవారం చేపపిల్లలను వదిలారు. పీఎంఎస్ఎస్‌వై పథకంలో భాగంగా నాగసముద్రం చెరువులోకి 30వేలు, మేడాపురం చెరువులోకి 20వేలు చేపపిల్లలను వదిలినట్టు ఆయన తెలిపారు. ఫిషర్ మెన్ కో ఆపరేటివ్ సొసైటీల మనుగడను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం ఉచితంగా చేప పిల్లలను అందిస్తుందని ఆయన వివరించారు. కార్యక్రమంలో ధర్మవరం మత్స్యశాఖ సహాయ సంచాలకుడు శంకరయ్య, టీడీపీ శ్రీసత్యసాయి జిల్లా ఉపాధ్యక్షుడు దండు ఓబుళేశు, వీఎఫ్ఏ భార్గవి, పంచాయతీ కార్యదర్శి చంద్రిక, ఆయా మత్స్య సొసైటీల సభ్యులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అభ్యసించాలి: సీఐ

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రమశిక్షణతో అభ్యసించాలని అనంతపురంరూరల్ సీఐ శేఖర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాములాయి వద్ద ఉన్న శ్రీచైతన్య కళాశాలలో విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుతం పోటీ ప్రపంచంలో జీవనం సాగిస్తున్నామని అన్నారు. అందుకు తగ్గట్టుగా విద్యార్థులు మెలగాలని తెలిపారు. క్రమశిక్షణ చాలా అవసరమని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళా శాల ఏజీఎం సుబ్బారెడ్డి, ప్రిన్సిపాళ్లు సమీనాఖాన్, విశ్వనాథ్, వైస్ ప్రిన్సిపాల్ కరీముల్లా, డీన్లు చిన్నబాబు, గంగాధర్, ఈశ్వర్‌రెడ్డి, ఏఓ గోపాల్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా స్థాయి వెటరన్ షటిల్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 పోటీలు ఆదివారం అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్‌స్టేడియంలో నిర్వహించనున్నట్లు జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్షుడు బుగ్గయ్యచౌదరి తెలిపారు. వెటరన్ సింగిల్స్, డబుల్స్‌లో 35ప్లస్, 40ప్లస్, 45ప్లస్, 50ప్లస్, 55ప్లస్, 60ప్లస్ క్యాటగిరిలలో పోటీలు ఉంటాయన్నారు. ఆసక్తి, అర్హతగల వెటరన్ క్రీడాకారులు పేర్లను నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు రాష్ట్రస్థాయి వెటరన్ బ్యాడ్మింటన్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు నిర్వాహక కార్యదర్శి నరేష్‌ను 9966103956, 9703263984 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీకాంత్ యాదవ్ విద్యార్థులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ బాలుర ఐటీఐ కళాశాలలో సైబర్ నేరాలపై అవగాహన సదస్సును నిర్వహించారు. ప్రిన్సిపాల్ రామమూర్తి అధ్యక్షతన నిర్వహించి సదస్సుకు సీఐ శ్రీకాంత్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సెల్‌ఫోన్స్ ద్వారా సైబర్ నేరాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. మెసేజ్‌లు, వాట్సాప్‌లు, ఫేస్‌బుక్‌లు తదితర వాటిద్వారా వచ్చే అనుమానాస్పద లింక్‌లను ఓపెన్ చేయరాదని హెచ్చరించారు. వ్యక్తి వివరాల వెల్లడిలో గోప్యతను పాటించాలని సూచించారు. ఏవైనా సమస్యలొస్తే పోలీసులకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌లో విద్య, వైద్యానికి అన్యాయం



నిరసన తెలుపుతున్న వామపక్ష నేతలు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేంద్ర బడ్జెట్‌లో విద్య వైద్యానికి తీరని అన్యాయం చేశారని, ప్రత్యామ్నాయ ప్రతిపాదనలు పెంచాలని వామపక్ష పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ నెల 20వ తేదీ వరకూ ప్రత్యామ్నాయ ప్రతిపాదనలపై ప్రజల్లో చైతన్యం తెస్తామని పేర్కొన్నారు. ఈనెల 14 నుంచి 20 వరకూ నిరసనలు తెలపాలన్న జాతీయ వామపక్ష పార్టీలు పిలుపునిచ్చాయి. ఈ మేరకు శుక్రవారం వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో క్లాక్‌టవర్ వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ.. ఆహార పదార్థాలపై సబ్సిడీ, వ్యవసాయం, విద్య, వైద్యం, గ్రామీణాభివృద్ధి, సంక్షేమంపై గత ఏడాది కంటే తక్కువ కేటాయింపులిచ్చారన్నారు. ఉపాధి పథకానికి అదనపు నిధుల కేటాయింపు ఇవ్వలేదన్నారు. సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప మాట్లాడుతూ.. మోదీ ప్రభుత్వం సంపన్నులకు రాయితీలివ్వడం దారుణం అన్నారు. ప్రజాపంపిణీ వ్యవస్థలను బలోపేతతం చేయడానికి ఆహార సబ్సిడీని పెంచాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు నాగరాజు, సీపీఎం నాయకుడు రామిరెడ్డి, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, ఇతర నాయకులు రాఘవేంద్ర, వెంకటనారాయణ, రమణ, అల్లిపీరా తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు ఎంపిక



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ స్కేటింగ్ పోటీలకు చిన్నారి అమీనాతాజ్ ఎంపికైంది. నగరంలోని పాతూరు అసార్‌వీధికి చెందిన చిరువ్యాపారి ఖలీల్‌బాషా, రుబీనా దంపతుల కూతురు అమీనాతాజ్ రెండేళ్లుగా స్కేటింగ్‌లో ప్రాక్టీస్ చేస్తోంది. ఇటీవల మహారాష్ట్రలో నిర్వహించిన నేషనల్ స్కేటింగ్ పోటీల్లో రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించిన అమీనాతాజ్ అండర్-7 బాలికల విభాగంలో మూడు పతకాలు సాధించి మలేషియాలో మార్చి మొదటి వారంలో జరిగే అంతర్జాతీయ పోటీలకు ఎంపికైంది.

పోలేపల్లిలో యల్లమ్మదేవి ఊరేగింపు



యల్లమ్మను ఊరేగిస్తున్న దృశ్యం

రామగిరి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పోలేపల్లిలో శుక్రవారం యల్లమ్మదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఊరేగించారు. యల్లమ్మదేవిని ప్రతిష్ఠించి ఏడాది పూర్తి కావడం తో గ్రామస్థులు అమ్మవారికి ప్ర త్యేక పూజలు చేశారు. దేవాలయంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. సాయంత్రం ప్రత్యేకపూజలు, భజనలు నిర్వహించారు.

మిద్దె పైనుంచి పడి వృద్ధుడి మృతి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక మారుతీనగర్‌లో నివాసముంటున్న ఓ వృద్ధుడు ప్రమాదవశాత్తు మిద్దె పైనుంచి కింద పడి మృతిచెందాడు. ఫోర్త్‌టౌన్ పోలీసుల వివరాల మేరకు.. మారుతీనగర్‌లో నివాసముంటున్న రాములప్ప శుక్రవారం మూడో అంతస్థుపై నుంచి ప్రమాదవశాత్తు కిందపడ్డారు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. నాలుగో పట్టణ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



చంద్రబాబుతో ఆనంద్‌రెడ్డి

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): నారా లోకేశ్ అభిమాన సంఘం జాతీయ అధ్యక్షుడు ఆనంద్‌రెడ్డి చేస్తున్న పలు సేవా కార్యక్రమాలను సీఎం చంద్రబాబు అభినందించారు. శుక్రవారం అమరావతిలోని ఏపీ సచివాలయంలో సీఎం చంద్రబాబును ఆనంద్‌రెడ్డి కలిసి, నారాలోకేశ్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు విష్ణేష్, రంగారెడ్డి, సుధాకర్‌నాయుడు, సునీత తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ శిబిరానికి కేఎస్ఎన్ విద్యార్థిని



ఎంపిక లెటర్‌ను అందజేస్తున్న ప్రిన్సిపాల్

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కేఎస్ఎన్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థిని కావ్య ఎన్ఎస్ఎస్ శిబిరానికి ఎంపికకావడం హర్షణీయమని ప్రిన్సిపాల్ సత్యలత పేర్కొన్నారు. శుక్రవారం ప్రిన్సిపాల్ తన కార్యాలయంలో విద్యార్థినికి ఎంపిక లెటర్‌ను అందజేసి మాట్లాడారు. మహారాష్ట్ర శివాజీ వర్సిటీలో ఈ నెల 16నుంచి 22వరకు ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరాన్ని నిర్వహిస్తోందన్నారు. రాష్ట్రం తరపున కావ్య శిబిరంలో పాల్గొనేందుకు వెళ్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మీరంగయ్య, పీఓ రామకృష్ణ, రమణనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనుల్లో జాప్యం చేస్తే చర్యలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పారిశుధ్య పనుల్లో జాప్యం చేస్తే చర్యలు తప్పవని నగర కమిషనర్ బాలస్వామి హెచ్చరించారు. శుక్రవారం కమిషనర్ పారిశుధ్య పనుల పర్యవేక్షణలో భాగంగా నగరంలోని ప్రభుత్వాసుపత్రిరోడ్డు, సాయినగర్, సూర్యానగర్‌రోడ్డు, సంఘమేష్ సర్కిల్, బెంగుళూరు రోడ్డు, వేణుగోపాల్‌నగర్ తదితర ప్రాంతాలను పరిశీలించారు. సంగమేష్ సర్కిల్ లో ఖాళీ స్థలాల్లో చెత్తను అధికంగా వే స్తున్నారని, హోటళ్లు, షాపుల నిర్వాహకులు పరిసరాల పరిశుభ్రతపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, వారిని గు ర్తించి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం శ్రీనగర్ కాలనీలో నీరు ప్రగతి పార్కును పరిశీలించారు. ఖాళీ స్థలంలోని పిచ్చి మొక్కలు, రాళ్లను తొలగించాల ని ఆదేశించారు. జిమ్ పరికరాలు పనిచేస్తున్నాయో లేదో పరిశీలించారు. వాటికి మరమ్మతులు చేయాలని ఆదేశించారు. స్థానికులు పార్కులోని సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ విష్ణుమూర్తి, ఈఈ షాకీర్, డీఈ సుభాష్ పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వంలో పారదర్శకమైన పాలనందించేలా సమాచార హక్కు చట్టాన్ని రూపొందించిందించని వివేకానంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పక్కీరప్ప పేర్కొన్నారు. శుక్రవారం కళాశాలలో సమాచార హక్కు చట్టంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో సమాచార హక్కు పరిరక్షణ సమితి ప్రతినిధులు హొన్నూరప్ప, రామలింగమయ్య, కరస్పాండెంట్ రాధ, జయరాంచౌదరి పాల్గొన్నారు.

నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్

కణేకల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం నుంచి ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఆంజనేయులు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీ గ్రూపులకు సంబంధించి సెకెండియర్ విద్యార్థులు తమ కళాశాలలో 108 మంది, గురుకుల పాఠశాలలో 39 మంది, మోడల్ స్కూల్‌లో 18 మంది కలిపి మొత్తం 165 మంది ఇక్కడే ప్రాక్టికల్స్‌కు హాజరు కానున్నట్లు చెప్పారు. 19వ తేదీ వరకు ప్రతి రోజూ ఉదయం, మధ్యాహ్నం వేళల్లో ప్రాక్టికల్స్ జరుగుతాయని అన్నారు. అలాగే ఒకేషనల్ విద్యార్థులకు కూడా 15 నుంచి 17వ తేదీ వరకు ప్రాక్టికల్స్ నిర్వహించనుండగా 57 మంది హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాట్లను చేపట్టినట్లు తెలిపారు.

బ్యాంకుల్లో ఔట్‌సోర్సింగ్ నియామకాలు ఆపాలి

గుంతకల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): బ్యాంకింగ్ వ్యవస్థలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగ నియామకాలను ఆపాలని యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ (యూఎఫ్‌బీయూ) నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచ్ వద్ద శుక్రవారం సాయంత్రం వివిధ బ్యాంకు సంఘాల నాయకులు ఆందోళన చేపట్టారు. పలువురు మాట్లాడుతూ బ్యాంకుల్లో ఉద్యోగ ఖాళీలను భర్తీచేసి పని ఒత్తిడిని తగ్గించాలని, వారానికి ఐదు రోజుల పనివిధానాన్ని అమలుచేయాలని, బ్యాంకు ఉద్యోగ సంఘాల అపరిష్కృత డిమాండ్లను పరిష్కరించాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో యూఎఫ్‌బీయూ నాయకులు నరేంద్ర కుమార్, హరికృష్ణ, ఎడిసన్, కే. శ్రీనివాసులు, కాశీవిశ్వనాథ్, రుక్సాన, సుప్రియ, తులసి తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

ఉరవకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జేకేసీ, నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కళాశాలకు చెందిన 96మంది విద్యార్థులు హాజరు కాగా గ్రీన్ టెక్ కంపెనీకి 17మంది, లోకల్ సర్వీస్ మొబైల్ యాప్ కంపెనీకి 9మంది ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ రామకృష్ణ తెలిపారు. ఎంపికైన వారికి నియామక ఉత్తర్వులు ఇచ్చినట్లు పేర్కొన్నారు. వైస్‌ప్రిన్సిపాల్ మస్తానప్ప, ప్లేస్‌మెంట్ అధికారి అయ్యన్న, జేకేసీ సమన్వయకర్తలు నారాయణస్వామి, నాగేంద్ర అధ్యాపకులు జయలక్ష్మి, పరమేష్ పాల్గొన్నారు.

చిన్నారుల ఆధార్ నమోదు తప్పనిసరి

యాడికి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల ఆధార్ నమోదు తప్పనిసరి అని ఐసీడీఎస్ తాడిపత్రి సీడీపీఓ సాజిదాబేగం సూచించారు. మండలకేంద్రంలోని పలు అంగన్‌వాడీ కేంద్రాలను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో మాట్లాడుతూ.. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే పిల్లలందరి ఆధార్ నమోదు తప్పనిసరి అని తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో సమయపాలన తప్పక పాటించాలని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే తీసుకుంటామని హెచ్చరించారు. సచివాలయం-3 బాల ఆధార్ నమోదుపై ఆరాతీశారు. ఆమె వెంట ఐసీడీఎస్ యాడికి సూపర్‌వైజర్ విజయకుమారి ఉన్నారు.

స్వాహా అయిన నిధుల రికవరీ

విడపనకల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపాధిహామీ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న నలుగురు సిబ్బంది స్వాహా చేసిన సొమ్మును గురువారం జిల్లా కార్యాలయంలో రికవరీ అయినట్లు ఎంపీడీఓ షకీలా బేగం శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు. ఏపీఓ సంజీవకుమార్ రూ.1.5లక్షలు, ఇన్‌చార్జి ఏపీఓ రామ్మోహన్ రూ. 1.23లక్షలు, సీఓ ధనుంజయ రూ. 1.06లక్షలు, బీఎఫ్ టీ రామాంజనేయులు రూ.46వేలు చెల్లించినట్లు చెప్పారు. ఇంకా నలుగురు చెల్లించాల్సి ఉందన్నారు. త్వరలోనే అందరితోనూ పూర్తిస్థాయిలో రికవరీ చేయిస్తామని పేర్కొన్నారు. అదేవిధంగా విడపనకల్లు మండలాన్ని రాష్ట్ర ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందని ఎంపీడీఓ తెలిపారు. దీంతో ఉపాధి పనులను వంద రోజుల నుంచి 150 రోజులకు పెంచారన్నారు. కూలీలు వినియోగించుకోవాలని కోరారు.

శ్మశాన వాటిక పరిశీలన



శ్మశాన వాటిక స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

ఆంధ్రజ్యోతి స్పందన

కుందుర్పి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరిగానపల్లిలో శ్మశాన స్థలం మాదే నంటూ మృతదేహాన్ని ఖననం చేయనివ్వకుండా వైసీపీ నాయకులు అడ్డుకోవడంపై శుక్రవారం ఆంధ్రజ్యోతిలో శ్మశానవాటిక మాదే అనే శీర్షికన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన డిప్యూటీ తహసీల్దార్ తిప్పేస్వామి, ఆర్ఐ పోతిరెడ్డి వెంటనే గ్రామానికి చేరుకుని శ్మశాన వాటికను పరిశీలించారు. గ్రామస్థులతో విచారించి సర్వే చేపట్టి ఆ స్థలం ప్రభుత్వ స్థలంగా గుర్తించారు. అనంతరం డీటీ మాట్లాడుతూ.. శ్మశానవాటికకు స్థలానికి హద్దులు, దారి ఏర్పాటు చేసేందుకు త్వరలోనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. వీఆర్వోలు నరసింహమూర్తి, రాజశేఖర్, సర్పంచ్ నాగేంద్ర, సర్వేయర్లు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రారంభం ఎప్పుడో..?

- పూర్తయిన పీహెచ్‌సీ భవన నిర్మాణం
- సేవలు ప్రారంభించని దుస్థితి



దర్గాహోన్నూరులో నిర్మించిన ఆస్పత్రి భవనం

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని దర్గాహోన్నూరు గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) భవన నిర్మాణం పూర్తయి ఏడాదవుతున్నా ప్రారంభానికి నోచుకోవట్లేదు. విలేజి క్లినిక్ భవనంలో అరకొర సౌకర్యాల నడుమ పీహెచ్‌సీ నిర్వహిస్తున్నారు. కనీస సౌకర్యాలు లేకపోవడంతో అత్యవసర సమయాల్లో రోగులు ఇతర ప్రాంత ఆస్పత్రులకు వెళ్లాల్సి వస్తోందని వాపోతున్నారు. మండలంలోని గోవిందవాడ, కల్లుదేవనహళ్లి, దర్గాహోన్నూరు, వన్నళ్లి తదితర గ్రామాల్లో ప్రజలకు వైద్య సేవలు అందించేందుకు సరైన ఆస్పత్రి లేదు. 2019లో అప్పటి రాష్ట్ర మంత్రి కాలవ శ్రీనివాసులు దర్గాహోన్నూరులో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణానికి రూ.2కోట్లు మంజూరు చేయించారు. తర్వాత అధికారం చేపట్టిన వైసీపీ 2024 ఎన్నికలకు ముందు మరోచోట భవనం నిర్మించింది. ఏడాదవుతున్నా అది ప్రారంభానికి నోచుకోలేదు. పరికరాలు రాక పోవడంతో భవనం అలంకారప్రాయంగా ఉంది. వైద్యులు మాత్రం విలేజి క్లినిక్‌లో అరకొర వసతులతో సేవలు అందిస్తున్నారు. వన్నళ్లి, దర్గాహోన్నూరు, గోవిందవాడ, తార్కాపురం, హోసళ్లి తదితర గ్రామాల ప్రజలు వైద్యం కోసం ఉరవకొండ, కర్ణాటకలోని రూపనగుడి ఆస్పత్రులకు వెళ్తున్నారు.

విలేజీ క్లినిక్‌లో వైద్య సేవలు

దర్గాహోన్నూరులో నిర్మించిన పీహెచ్‌సీ భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో విలేజి క్లినిక్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. కనీసం ఐదుగురు రోగులు కూర్చోవడానికి కూడా సరిపోని ఓ గదిని ఏర్పాటు చేశారు. బెడ్లపై చికిత్స అందించే పరిస్థితి లేదు. అత్యవసరం అయితే ఉరవకొండ, రూపనగుడి ప్రాంతాలకు వెళ్లాల్సిందే.

తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు

- అమృత్ 2 కింద రూ. 78.85 కోట్ల నిధులు విడుదల
- ప్రభుత్వ విప్ కాలవ వెల్లడి



అధికారులతో సమీక్షిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

రాయదుర్గం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు గాను అమృత్ -2 కింద రూ. 78.85 కోట్ల నిధులతో సమగ్రనివేదికను సిద్ధం చేసినట్లు ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు తెలిపారు. దీనికి సంబంధించి నిధులు కూడా మంజూరు అయ్యాయని వివరించారు. దీనిపై గురువారం రాత్రి పట్టణంలోని ఆర్అండ్‌బీ అతిథిగృహంలో ఆయన మున్సిపల్ అధికారులతో పాటు కన్సల్టెన్సీ ప్రతినిధులతో సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పట్టణంలో 7 ఎంఎల్‌డీ తాగునీటి శుద్ధి ప్లాంట్లు, నాలుగు ఓవర్‌హెడ్ ట్యాంకులు, 39 కిలోమీటర్ల మేర అంతర్గత పైప్‌లైన్‌లు, 6060 గృహాలకు తాగునీటి కొళాయి కనెక్షన్లు, 16 కిలోమీటర్ల మేరకు తాగునీటి ప్రధాన పైపులైన్‌కు సంబంధించి సమగ్ర నివేదికను సమర్పించేలా ఆదేశించారు. ఇప్పటికే సిద్ధమైన సమగ్రనివేదికలో స్వల్పమార్పులు చేయాలని సూచించారు. ప్రధానంగా తాగునీటి పరంగా భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఉండకూడదని, ప్రతి ఇంటికి నీరు అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డితో పాటు ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

రేపు టౌన్ బ్యాంక్ సమావేశం

గుత్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):పట్టణంలోని గుత్తికోఆపరేటివ్ టౌన్ బ్యాంక్ సర్వ సభ్య సమావేశాన్ని ఈనెల 16న నిర్వహించనున్నట్లు టౌన్ బ్యాంక్ అధ్యక్షుడు అబ్దుల్‌జిలాన్, సీఈఓ మహేశ్వరప్రసాద్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఆర్ఎస్ రోడ్డులోని మార్కెట్‌యార్డుఎదురుగా వసుధ ఫంక్షన్‌హాల్లో ఉదయం 11గంటలకు సమావేశం నిర్వహించనున్నామన్నారు. ఇందులో బడ్జెట్ అంశాలపై చర్చిస్తామన్నారు. ఖాతాదారులు, డైరెక్టర్లు హాజరుకావాలని కోరారు.

మట్కా బీటర్ అరెస్టు

తాడిపత్రి ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) పట్టణంలోని శ్రీనివాసపురానికి చెందిన ఓ మట్కాబీటర్‌ను శుక్రవారం అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ సాయి ప్రసాద్ తెలిపారు. స్థానిక నందలపాడు, పప్పూరు రోడ్డు, శ్రీనివాసపురం తదితర ప్రాంతాల్లోని మట్కా స్థావరాలపైసిబ్బందితో కలిసి దాడులు చేశామని, అందులో మట్కాబీటర్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని, అతడి వద్ద నుంచి 71700 నగదును, మట్కాచీటీలను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు..

యాడికి: మండలంలోని వీరన్నపల్లి గ్రామసమీపంలో శుక్రవారం ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు సీఐ ఈరన్న తెలిపారు. వీరన్నపల్లి సమీపంలో పేకాటాడుతున్నారన్న సమాచారం అందడంతో సిబ్బందితో దాడులు చేశామని, అందులో ఏడుగురిని అరెస్టు చేసి వారి వద్ద నుంచి రూ. 6100 నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగవరంలో గల శ్రీరామిరెడ్డి తాగునీటి ప్రాజెక్టు పంపుహౌస్ నుంచి కళ్యాణదుర్గం మడకశిర, హిందూపురం ప్రాంతాల పరిధిలోని గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు ఇంజనీర్ సాయినాథ్ శుక్రవారం ప్రకటనలోతెలిపారు. నాలుగు రోజుల క్రితం పంపుహౌస్‌లో షార్ట్ సర్క్యూట్‌తో మోటారు బ్రేకర్ కాలిపోవడంతో నీటి సరఫరా ఆగిందన్నారు. కొత్త మోటారును బిగించి ఈ ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాలకు తాగునీటి సరఫరాకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

ఘనంగా దామోదరం సంజీవయ్య జయంతి

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): అంధ్రరాష్ట్ర మొట్టమొదటి దళిత ముఖ్యమంత్రి దామోదరం సంజీవయ్య 104 జయంతి వేడుకలను మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళ్యాణదుర్గం డీఎల్‌పీఓ నాగేశ్వరరావు, ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ తదితరులు సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ముఖ్యమంత్రిగా ఆయన రాష్ట్రానికి చేసిన సేవల్ని కొనియాడారు. సీనియర్ అసిస్టెంట్ హనుమంతప్ప, జూనియర్ అసిస్టెంట్ గౌరీశంకర్ తదితరులు పాల్గొన్నారు.

శెట్టూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఉద్యోగులు, సిబ్బంది మాజీ సీఎం దామోదరం సంజీవయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ ఈశ్వరయ్య శెట్టి, ఎంపీడీఓ రఘురామారావు, పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యల్లనూరు: మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో దామోదర సంజీవయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఇన్‌చార్జి ఎంపీడీఓ వాసుదేవరెడ్డి , పంచాయతీ సెక్రటరీ, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

వీరజవాన్లకు ఘన నివాళి



గుంతకల్లులోని ఎస్ఎస్‌జీఎస్ డిగ్రీ కళాశాలలో నివాళులర్పిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తాడిపత్రి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): 2019లో జమ్ముకశ్మీర్‌లోని పుల్వామా దాడి ఘటనలో వీరమరణం పొందిన 40మంది జవానులకు పట్టణంలోని బీజేపీ నాయకులు శుక్రవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్థానిక గాంధీసర్కిల్‌లో వీరజవానుల ఫ్లెక్సీ వద్ద నివాళులర్పించారు. అనంతరం పట్టణ అధ్యక్షుడు కృష్ణమోహన్ మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదులు గ్రెనేడ్‌తో దాడిచేసి జవానులను హతమార్చారన్నారు. వారి ప్రాణత్యాగాన్ని ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని తెలిపారు. నివాళులర్పించిన వారిలో పార్టీ మండల అధ్యక్షుడు శేషానందరెడ్డి, నాయకులు శింగరి లక్ష్మినారాయణ, రాంబాబు, గంగాధర్‌యాదవ్, నారాయణస్వామి, సుధాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

గుంతకల్లుటౌన్: పట్టణంలోని శంకరానందగిరి స్వామి డిగ్రీ కళాశాలలో అమరజవాన్లకు నివాళులర్పించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, ఎన్‌సీసీ లెఫ్టినెంట్ ప్రకాష్, వైస్‌ప్రిన్సిపాల్ సురేష్‌బాబు, అధ్యాపకులు పాల్గొన్నారు. అలాగే ఎస్కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అమరజవాన్లకు నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి నారాయణ, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత వారోత్సవాలపై అవగాహన

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరంపల్లి సమీపంలో గల పాలిటెక్నిక్ కళాశాలలో విద్యార్థులకు శుక్రవారం రోడ్డు భద్రత వారోత్సవాలపై ఆర్టీవో రమేష్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతిఒక్కరూ రోడ్డు నిబంధనలు తప్పక పాటించాలని సూచించారు. మొబైల్ మాట్లాడుతూ, మద్యం తాగి వాహనాలు నడపరాదన్నారు. కార్యక్రమంలో దాదాపు రెండు వందల మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కలశ ప్రతిష్ఠ

కణేకల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయ గోపురంపై శుక్రవారం కలశ ప్రతిష్ఠను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేదపండితులు, అర్చకులు ఉదయం 9గంటలకు వేదమంత్రోచ్చారణాల మధ్య ప్రత్యేకపూజలు నిర్వహించి ఆలయగోపురంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. అంతకుముందు ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిపారు.

17 ధ్వజస్తంభ ప్రతిష్ఠ

బెళుగుప్ప: మండల కేంద్రంలో మంజునాథ స్వామి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ మహోత్సవాలను ఈ నెల 16 నుం చి 17వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు ఆల య కమిటీ సభ్యులు, గ్రామపెద్దలు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రెండు రోజుల పాటు మళయాళి పండితులు ఆధ్వర్యంలో ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. 17న తేదీన ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు.

ట్రాఫిక్ రూల్స్ పాటించాలి

ఉరవకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని గుంతకల్లు ఎంవీఐ రాజాబాబు సూచించారు. పట్టణంలో శుక్రవారం ఆయన జాతీయ రహదారి భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సీటు బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరారు. ఎస్ఐ జనార్ధన్ నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

17న వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

గుత్తి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యల పరిష్కారం కోరుతూ ఈనెల 17వ తేదీన పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు వామపక్ష పార్టీల నాయకులు తెలిపారు. స్థానిక అర్అండ్‌బీ అతిథి గృహంలో శుక్రవారం వారు రౌండ్ టెబుల్ సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇటీవల కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఏపీకి అధిక బడ్జెట్ కేటాయించాలని కోరుతూ ధర్నా చేయాలని నిర్ణయించామన్నారు. ప్రజలు, కార్మికులు విజయవంతం చేయాలని కోరారు. నాయకులు నిర్మల, రామదాసు, రామకృష్ణ, మల్లికార్జున, షఫి, తదితరులు పాల్గొన్నారు.

ఏప్రిల్ కల్లా ఆస్పత్రిని అప్పగించాలి: జేసీపీఆర్



ఆస్పత్రిలో కలియ తిరుగుతున్న జేసీపీఆర్

తాడిపత్రి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నూతన భవనాన్ని అన్ని హంగులతో నిర్మించి ఏప్రిల్ కల్లా అప్పగించాలని ఎస్వీ కన్‌స్ట్రక్షన్స్ కాంట్రాక్టర్ శ్రీనివాసరెడ్డిని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి కోరారు. ఆస్పత్రిని శుక్రవారం ఆయన కాంట్రాక్టర్‌తో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే ఆస్పత్రి అభివృద్ధికి ప్రభుత్వంతో పనిలేకుండా తన సొంత డబ్బులు రూ.60లక్షలు ఖర్చుచేశానని, అవసరమైతే మరింత చెల్లిస్తానని తెలిపారు. కాంట్రాక్టర్ మాట్లాడుతూ నాలుగు అంతస్థుల భవనం పూర్తి కావాలంటే దాదాపు రూ. కోటిన్నర ఖర్చు అవుతుందని, ఇప్పటికే బిల్లులు రాలేదని, దీంతో పనులు చేయాలంటే కష్టంగా ఉందని తెలిపారు. జేసీపీఆర్ మాట్లాడుతూ మీ పరిస్థితి మాకు అర్థమైందని, అందుకే తన సొంత డబ్బులు రూ.60లక్షలు ఇచ్చానని, అవసరం అనుకుంటే మరో రూ.90లక్షలు ఇస్తానని చెప్పారు. ఏప్రిల్ కల్లా నాలుగు అంతస్థుల బిల్డింగ్‌ను అన్ని హంగులు, సౌకర్యాలతో నిర్మించి, రోడ్లు కూడా వేసి మాకు అప్పజెప్పాలని సూచించారు. ఇప్పటికే రెండు అంతస్థుల నిర్మాణం పూర్తయిందని, మిగతా రెండు అంతస్థులను కూడా పూర్తిచేసి అందజేస్తామని కాంట్రాక్టర్ పేర్కొన్నారు. అనంతరం జేసీపీఆర్ ఆస్పత్రి అంతా కలియతిరిగారు. రోగుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డేవిడ్‌సెల్వరాజ్, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాసులునాయుడు, డీఈ సుదర్శన్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఎస్వీ రవీంద్రారెడ్డి, అరవింద నారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల తీరు మారకపోతే కఠిన చర్యలు

ఆటోల్లో ముందర సీట్లో ప్రయాణికులను ఎక్కించరాదని ఆటో డ్రైవర్లకు ఇప్పటికే చాలాసార్లు చెప్పానని, ఇంకా అలాగే ఉన్నారని, ఇకపై తీరు మారకపోతే కఠిన చర్యలు తప్పవని జేసీపీఆర్ హెచ్చరించారు. పట్టణంలోని తన నివాసంలో ఆయన మాట్లాడుతూ.. ఆటోడ్రైవర్లు ఆటోల ముందర సీట్లలో ఇద్దరి నుంచి ముగ్గురు ప్రయాణికులను ఎక్కిస్తున్నారని, ఇలా అయితే ఎలా డ్రైవింగ్ చేస్తారని మండిపడ్డారు. ముందర సీట్లో కేవలం డ్రైవర్ మాత్రమే ఉండాలని పలుసార్లు హెచ్చరించినా వారితీరు మారలేదన్నారు. ఇకనుంచి ఎవరైనా అలా చేస్తే వారి ఆటోను ఆర్టీఓ అధికారులకు అప్పజెబుతామని హెచ్చరించారు.

వైభవంగా గురుసిద్ధావధూత రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో గురుసిద్ధావధూత

ఉరవకొండ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలిగొండ గ్రామంలో శుక్రవారం తెల్లవారుజామున గురుసిద్ధావధూత రథోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం రాత్రి నంది కోలాటాలతో గంగా జలాన్ని ఊరేగింపుగా తీసుకొచ్చి స్థానిక ఆలయంలోని గురుసిద్ధేశ్వర స్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, ప్రత్యేక పూజలను చేశారు. అనంతరం వేకువజామున ఉత్సవమూర్తిని రథంపై కొలువుదీర్చి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు అరటి, జామపండ్లు విసిరి మొక్కులు తీర్చుకున్నారు. చుట్టుప్రక్కల గ్రామాలనుంచే కాకుండా కర్ణాటక నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు.

ఘనంగా అక్కమహాదేవతల గ్రామోత్సవం

యాడికి, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో అక్కమహాదేవతల గ్రామోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక కమలపాడురోడ్డులో ఉన్న అక్కమహాదేవతల ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు అమ్మవారి కలశాలను ఆలయం వద్ద నుంచి గ్రామ ప్రధాన వీధుల గుండా ఊరేగించారు. నిర్వాహకులు సూర్యనారాయణ, బండారు రాఘవ, ప్రశాంత్‌కుమార్, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి పాదయాత్ర



పాదయాత్రను ప్రారంభిస్తున్న శివమాలధారులు

శెట్టూరు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లక్ష్మంపల్లి గ్రామం నుంచి పలువురు శివమాలధారులు నంద్యాల జిల్లా శ్రీశైలానికి శుక్రవారం పాదయాత్ర ప్రారంభించారు. ఉదయమే గ్రామంలోని శివాలయంలో ఇరుముడి కట్టుకున్నారు. అనంతరం సాయంత్రం పాదయాత్రగా శ్రీశైలానికి బయలుదేరారు. పాదయాత్రను వైస్‌ఎంపీపీ ముత్యాలు జెండా ఊపి ప్రారంభించారు. సుమారు 410 కిలోమీటర్లు పాదయాత్ర చేస్తున్నట్లు మాలధారులు తెలిపారు.

ఘనంగా శివమాలధారుల ఊరేగింపు



శివుడి వేషధారణలో మాలధారులు

కణేకల్లు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బ్రహ్మసముద్రం గ్రామంలో శుక్రవారం శివమాలధారులు ప్రత్యేక అలంకరణలో గ్రామంలో ఊరేగారు. ఒంటికి విభూధిని పట్టించుకుని, చేతిలో త్రిశూలం ధరించి శివనామస్మరణ చేస్తూ గ్రామ పురవీధుల్లో ఊరేగారు. అలాగే శివుడి చిత్రపటాన్ని ప్రత్యేక రథంలో ఉంచి ఊరేగించారు. పలువురు మహిళలు హారతులు పట్టుకుని ఊరేగింపు ముందు నడిచారు.

భోగేశ్వర స్వామి కల్యాణోత్సవానికి ఎమ్మెల్యేకు ఆహ్వానం

పామిడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భోగేశ్వరస్వామి, ప్రసన్న పార్వతీదేవి కల్యాణోత్సవాన్ని ఈనెల 17వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు శివమాలధారులు శుక్రవారం తెలిపారు. ఈ వేడుకల్లో పాల్గొనాలని ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాంకు, టీడీపీ మండల ఇన్‌చార్జి గుమ్మనూరు ఈశ్వర్‌కు గుంతకల్లులో ఆహ్వాన పత్రికను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో గురుస్వాములు అప్పన్నగారి కుమార్, శ్రీరాములు, రామప్ప, శివమాలధారులు పాల్గొన్నారు.

దాతలకు సన్మానం

పామిడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని తలవాలకట్ట సమీపంలో గల సరస్వతీ విద్యా మందిరంలో నూతన భవన నిర్మాణానికి విరాళాలు అందజేసిన దాతలను శుక్రవారం ఆ పాఠశాల కమిటీ ఘనంగా సత్కరించింది. కాసంశెట్టి సాయిప్రకాష్, కాసంశెట్టి విశ్వనాథ్, కల్లమడి బాలా నాగరాజగుప్తా, దేవగుడి సోమశేఖర్‌స్వామి ఒక్కొక్కరు రూ.2.50లక్షలు విరాళం అందజేసినట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు. విరాళం అందించిన దాతలు కాసంశెట్టి విశ్వనాథ్, కాసంశెట్టి సాయిప్రకాష్‌ను శాలువాలు కప్పి పూలమాలలు వేసి సత్కరించారు. పాఠశాల అధ్యక్షులు రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడు బొల్లు శ్రీనివాసరెడి తదితరులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంతపురం వారు క్రింద తెలిపిన ఆస్తి తాకట్టుపై బాల అశోక్‌కుమార్ S/o లేట్ బాల రామకృష్ణ, ఎగువపల్లి గ్రామం , గార్లదిన్నె మండలం, అనంతపురము జిల్లా వారికి ఋణం ఇవ్వదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్నచో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రిం.డి పామిడి సబ్ రిం.డి.కి చేరిన పామిడి మండల క్రిందంలోని సర్వేనెం. 286-బిలో ప్లాట్ నెంబర్ 12,13,14,15 చెక్కుబంది:-తూర్పు : 15 అడుగుల వెడల్పు గల రోడ్డు, పడమర: మదరసా స్థలం, ఉత్తరం:పార్ట్3లోని ప్లాట్ నెం.16, దక్షిణం:నాయొక్క ప్లాట్ నెం.16.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907

బహిరంగ ప్రకటన

ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమేమనగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, బ్రాంచ్-1 అనంత పురం వారు షేక్ కమాల్ బాషా S/o లేట్ ఐజేన్ సాబ్, సయ్యద్ అమీర్ బాష S/o Late రాగులపాటి చిన్న రాజాసాబ్ అను పేరున గల అనే ఆస్తి తాకట్టు పై షేక్ ఇఫ్తికర్ అహమ్మద్ S/o షేక్ కమాల్ బాషా, కల్లూరు గ్రామం,గార్లదిన్నె మండలం, అనంతపురము జిల్లా వారికి ఋణం ఇవ్వదలచు కున్నారు దీనిపై ఎవ్వరికైనా అభ్యంతరాలు, తకరార్లు ఉన్న చో 7 రోజుల లోపు నాకు గానీ నా క్లయింట్‌కు గానీ తెలుపగలరు.

షెడ్యూలు

అనంతపురం రిం.డి పామిడి సబ్ రిం.డి.కి చేరిన పామిడి మండల క్రిందంలోని సర్వేనెం. 404-బి1లో 3 ఎకరాల భూమి వివరం చెక్కుబంది:-తూర్పు : ఇదే సర్వేనెంబర్‌లోని నిట్టూరు సాదిక్‌వలి భూమి పడమర: యం.సునీల్ కుమార్ రెడ్డి భూమి, ఉత్తరం: బెల్లం సాహెబ్ వారి భూమి, దక్షిణం: శ్రీపురం ఓబులమ్మ వ్యాపారాల భూమి.

Y.రామేశ్వర రెడ్డి, అడ్వకేట్,
ATP Cell:9440565907

బాధిత రైతులకు ఆర్థిక సాయం

గుత్తిరూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అనగానిదొడ్డి గ్రామానికి చెందిన క్రిష్ణయ్య, రామాంజనేయులు, రంగడు అనే రైతులకు ఎమ్మెల్యే సోదరుడు గుమ్మనూరు నారాయణ శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ఆ రైతులకు చెందిన గడ్డి వాములకు గురువారం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పంటించడంతో పూర్తిగా దగ్ధమయ్యాయి. దీనివల్ల వారికి నష్టం వాటిల్లడంతో ఎమ్మెల్యే సోదరుడు గ్రామానికి వెళ్లి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున మొత్తం 30 వేలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ పట్టణ కన్వీనర్ ఏంకే చౌదరి, నాయకులు శ్రీనివాసులు, తిమ్మప్ప, గోవర్ధన్ గౌడ్, సాంబశివ తదితరులు పాల్గొన్నారు.

చెత్తతో సంపద తయారీ కేంద్రాల పరిశీలన

బొమ్మనహాళ్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని నేమకల్లు, కురవళ్లి, సిద్ధరాంపురం గ్రామాల్లో గల చెత్తనుంచి సంపద నుంచి తయారీ కేంద్రాలను శుక్రవారం కళ్యాణదుర్గం డీఎల్‌డీఎల్‌ఓ నాగేశ్వరరావు తనిఖీ చేశారు. ఈ కేంద్రాల నిర్వహణ సజావుగా ఉండాలని స్థానిక అధికారులకు సూచించారు. వానపాములను పెంచి ఎరువు తయారీతో సంపదను సృష్టించాలని, దీని ద్వారా పంచాయతీకి ఆదాయం పెరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయభాస్కర్, ఈఓపీఆర్డీ దాస్ ఉన్నారు.

ఏఓపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని వినతి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో మహిళా ఉద్యోగులను మానసికంగా వేధిస్తున్న ఏఓ భూషణంపై క్రమ శిక్షణ చర్యలు తీసుకోవాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ గుంతకల్లు డివిజన్ కార్యదర్శి బీసురేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన పార్టీ నాయకులతో కలిసి ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ ఉదయ్‌భాస్కర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్యాలయంలో ఏఓ మహిళా ఉద్యోగులతో కాంపౌండ్‌లో ఉన్న చెత్తను ఊడిపిస్తూ.. బాత్‌రూంలను, అధికారులు తిన్న ప్లేట్లను కడిగిస్తూ మానసికంగా హింసిస్తున్నారని తెలిపారు. అతడి తీరుతో ఉద్యోగినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నట్లు చెప్పారు. అధికారులు ఏఓ భూషణంపై విచారణ జరిపించి క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు రఘునాథరెడ్డి, జిలాన్, సత్తార్, రామాంజనేయులు, షెక్షావలి, హనమంతు, బాషా, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

శీర్పి, బెళుగుప్ప చెరువులకు జలకళ



నిండుకుండలా శీర్పి చెరువు

బెళుగుప్ప, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శీర్పి, బెళుగుప్ప చెరువులకు జలకళ సంతరించుకుంది. ఈ నెల 8వ తేదీన 36వ ప్యాకేజీ నుంచి ఆయా చెరువులకు హంద్రీనీవా జలాలను వదిలారు. దీంతో రెండు రోజులకే పూర్తిస్థాయిలో చెరువులు నిండి మరువ పారాయి. రెండు చెరువులలోకి నిండుగా నీరు చేరడంతో బెళుగుప్ప, శీర్పి, వెంకటాద్రిపల్లి, ఆవులెన్న, ఎర్రగుడి తదితర గ్రామాల్లో తాగునీటి, సాగునీటికి ఎలాంటి ఇబ్బంది ఉండదని ఆయా గ్రామస్థులు పేర్కొన్నారు.

ఆధునిక సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆధునిక సాంకేతికతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలని జేఎన్‌టీయూ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రవణకుమార్ పంతుల సూచించారు. పట్టణంలోని శంకరానందగిరిస్వామి డిగ్రీ కళాశాలలో శుక్రవారం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఎంఎస్ ఎక్సెల్ ఫర్ రీసెర్చ్ అండ్ ఆర్టిఫిషియల్ టూల్స్ అనే అంశంపై వర్క్‌షాప్ జరిగింది. ఇందులో ప్రొఫెసర్ పాల్గొని మాట్లాడారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంపై విద్యార్థులు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత ప్రపంచాన్ని శాసించబోయే టెక్నాలజీ ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ అని అభివర్ణించారు. కళాశాల డైరెక్టర్ గోపాల్, కెరియర్ ప్రమోషన్ సెంటర్ డైరెక్టర్ డాక్టర్ వరప్రసాద్, అకాడమిక్ కోఆర్డినేటర్ నటరాజ్, అధ్యాపకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ

పెద్దవడుగూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వీఆర్‌ఓలు, గ్రామ రెవెన్యూ సహాయకులు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలన్నారు. గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన అర్జీలను పరిశీలించి సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని సూచించారు. తహసీల్దార్ ఉషారాణి, డీటీలు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం ఎంపిక

పామిడి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో బీజేపీ మండల నూతన కార్యవరాన్ని ఎంపిక చేసినట్లు అధ్యక్షుడు చౌహాన్ అంజినాయక్ తెలిపారు. ఉపాధ్యక్షులుగా మల్లికార్జున ఆచారి, తపాల లక్ష్మి, ఎర్రిస్వామి, యాతం వెంకట్రాంరెడ్డి, చీమల దొడ్డన్న, శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శులుగా ఎం కుమారస్వామి, రామ్ నరేష్, కార్యదర్శులుగా కుమారి రాథోడ్, కడింటి దేవరాజు, బీ లక్ష్మి, వరలక్ష్మి, నక్కా సురేష్, శేఖర్ రెడ్డి, కోశాధికారిగా పీ సురేంద్ర కుమార్‌ను ఎంపిక చేసినట్లు చెప్పారు.

హ్యాండ్‌రైటింగ్‌లో విద్యార్థిని ప్రతిభ

తాడిపత్రి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సంజీవనగర్ రెండో రోడ్డులో గల శ్రీ సాయిచైతన్య స్కూల్‌కు చెందిన టెన్త్ విద్యార్థిని లలిత విజయవాడలో ఇటీవల జరిగిన నేషనల్ హ్యాండ్‌రైటింగ్ పోటీల్లో ప్రతిభ చూపి రెండో స్థానం సాధించిందని కరెస్పాండెంట్ లక్ష్మీనరసింహ తెలిపారు. ఇందుకు శుక్రవారం ఆ విద్యార్థినిని ఉపాధ్యాయ బృందం అభినందించారు.